

తారలు తళుక్కు

నగరంలోని టవర్‌క్లాక్ కూడలి వద్ద సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సినీతారలు పాయల్ రాజ్‌పుత్, నబా నటేశ్ విచ్చేసి సందడి చేశారు. వీరిని చూసేందుకు అభిమానులు రావడంతో ఆ ప్రాంతమంతా కిక్కిరిసింది.

- ఈనాడు, అనంతపురం.



శక్తి స్వరూపిణి.. శత్రు సంహారిణి

జిల్లాలో శుక్రవారం రెండోరోజు దసరా ఉత్సవాలు ఘనంగా సాగాయి. అనంతపురంలోని కొత్తూరు అమ్మవారిశాలలో నవశక్తిమాతగా కన్యకా పరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు.

-న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

స్థలం ఇచ్చినా.. సద్వినియోగం చేసుకోరా?

- పరిశ్రమలు ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం
- వెనక్కి తీసుకునేందుకు అధికారుల కసరత్తు



ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..

- పారిశ్రామిక పార్కులు: 33
- ఎంఎస్ఎంఈ పార్కులు: 04
- సేకరించిన మొత్తం భూమి: 7,053 ఎకరాలు
- కేటాయించింది: 1,941 ఎకరాలు
- ఖాళీగా ఉన్నవి: 5,112 ఎకరాలు

ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, హిందూపురం

పారిశ్రామికవాడల్లో భూములు తీసుకున్న కొందరు పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఫలితంగా ఏపీఐఐసీ పరిధిలోని భూమి నిరుపయోగంగా మారుతోంది. నిబంధనల మేరకు పారిశ్రామికవాడలు, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) పార్కుల్లో ప్లాట్లు పొందితే నిర్ణీత గడువులోపు యూనిట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో వారికిచ్చిన భూమి వెనక్కి తీసుకునే అధికారం ఏపీఐఐసీకి ఉంది. భూములు పొందిన వారిలో చాలామందికి రాజకీయ నాయకులతో సంబంధాలు ఉండటంతో అధికారులు సైతం చూసిచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

180 మందికి తాఖీదులు

ఏపీఐఐసీ పరిధిలో 37 పారిశ్రామికవాడలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం రాయితీతో రూ.20 లక్షల వరకు భూములు ఇచ్చారు. మిగిలిన వారికి మార్కెట్ ధర మేరకు భూములు కేటాయించారు. వీరిలో కొందరు ఇప్పటివరకు యూనిట్లు ఏర్పాటు చేయలేదు. అలాంటి వారికి ఇచ్చిన భూములు రద్దు చేయాలని అధికారులు గతంలోనే నిర్ణయం తీసుకున్నా.. రాజకీయ జోక్యంతో ఆలస్యమవుతూ వచ్చింది. తెదేపా కూటమి ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేయని వారిని గుర్తించి తుది నోటీసులు జారీ చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి అనంత జిల్లాలో 180 మందికి తాఖీదులు జారీ చేశారు. ఎలాంటి స్పందన లేకపోతే భూములు వెనక్కి తీసుకుంటామని ఏపీఐఐసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే 19 మందికి ఇచ్చిన భూముల్ని రద్దు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అవకాశం ఇచ్చినా..

ఉమ్మడి జిల్లాలో 2008 నుంచి 2020 వరకు పారిశ్రామికపార్కుల్లో భూములు తీసుకుని యూనిట్లు ఏర్పాటు చేయని వంద మందిని రెండేళ్ల కిందటే గుర్తించారు. వారందరికీ అప్పట్లోనే తుది నోటీసులు జారీ చేశారు. అప్పటి వైకాపా ప్రభుత్వం మళ్లీ వారికే భూములు కేటాయించాలని నిర్ణయించింది. ఈక్రమంలో వందమందికి రెండోసారి అవకాశం కల్పించారు. అందులో 50 మంది మాత్రమే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మిగిలిన 50 మంది నుంచి ఎలాంటి స్పందన లేదు.

వైకాపా హయాంలో నిర్లక్ష్యం

వైకాపా ప్రభుత్వం పారిశ్రామికవాడల అభివృద్ధికి ఐదేళ్లలో కనీస నిధులు ఇవ్వలేదు. దీంతో యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం నీటి వసతి కల్పించడంలోనూ గత ప్రభుత్వం విఫలమైంది.



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కు

ప్రస్తుతం తెదేపా కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. లీజు పద్ధతిలో భూమి కేటాయించేలా నిర్ణయం తీసుకుంది. దీనివల్ల యజమానులకు పెద్దమొత్తం వెచ్చించి భూమిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా పెట్టుబడి ఎక్కువ పెట్టే అవకాశాలు ఉన్నాయి.

ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తున్నాం

- శువనా సోని, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు

పారిశ్రామికవాడల్లో భూములు తీసుకుని పరిశ్రమలు ఏర్పాటు చేయని వారికి ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తున్నాం. 180 ప్లాట్లకు సంబంధించి భూములు వెనక్కి తీసుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటిని రద్దు చేసి కొత్తవారికి కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాం.

హంద్రీనీవాకు మహర్దశ

తొలి దశలో విస్తరణ.. మలి విడత సిమెంట్ లైనింగ్

వైకాపా సర్కారు వంచన

కరవు సీమను సస్యశ్యామలం చేస్తామని స్వయంగా అప్పటి సీఎం జగన్ మాయమాటలతో దగా చేశారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తామంటూ 2019, అక్టోబరు 10న అనంతపురం కొత్తూరు జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన 'కంటి వెలుగు' ప్రారంభోత్సవంలో ఆర్భాటంగా ప్రకటించారు. కనీసం పైసా ఇవ్వలేదు.. గంప మట్టి ఎత్తలేదు.

తెదేపా కూటమి ప్రభుత్వ కార్యాచరణ

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. నీటి సీజన్ దాటగానే పనులు మొదలు పెట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈనెల 2న ఉన్నతాధికారులకు సమీక్ష నిర్వహించారు. అంచనాలు తయారు చేసి.. వచ్చే వేసవి నాటికి పనులకు శ్రీకారం చుట్టేలా చర్యలు చేపట్టారు.




విస్తరించనున్న తొలి దశ ప్రధాన కాలువ

హంద్రీనీవా ప్రాజెక్టు వివరాలు

అంశం	మొత్తం	ఉమ్మడి అనంత జిల్లా
ఆయకట్టు (ఎకరాలు)	6,02,500	3,45,000
తొలి దశ దూరం (కి.మీ.)	216	73
రెండో దశ.. (కి.మీ.)	349	274
జలాశయాలు	08	04

మూడేళ్లలో జిల్లా చేరిన జలాలు (టీఎంసీల్లో)



అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే

ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రాజెక్టుకు మళ్లీ మంచిరోజులు రానున్నాయి. కర్షకుల మోములో చిరునవ్వు చిందేలా తెదేపా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం నుంచి తక్కువ రోజుల్లోనే ఎక్కువ నీటిని పొందేలా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులు చేసేందుకు శ్రీకారం చుట్టనుంది. ఈనెల 2న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ సారథ్యంలో కీలక సమీక్ష జరిగింది. ప్రస్తుత నీటి సీజన్ దాటగానే నిర్దేశిత పనులు మొదలు పెట్టడానికి దృష్టి సారించాలంటూ మౌఖిక ఆదేశాలు జారీ అయ్యాయి. అంచనాల తయారీతోపాటు పరిపాలన, సాంకేతిక ఆమోదం.. తదితర ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు మొదలైంది.

10 నుంచి 19 మీటర్లకు..

హంద్రీనీవా ప్రధాన కాలువ ఉమ్మడి కర్నూలు జిల్లా మాల్యాల నుంచి మొదలై... 143 కి.మీ. వద్ద అనంత జిల్లా సరిహద్దుకు చేరుతుంది. 216 కి.మీ. వద్ద జీడిపల్లి జలాశయం వరకు తొలి దశ కాలువ ముగుస్తుంది. మన జిల్లాలో తొలి దశ ప్రధాన కాలువ పొడవు 73 కి.మీ. మొత్తం 3850 క్యూసెక్కుల ప్రవాహం సామర్థ్యం ఉన్నా... ప్రస్తుతం 2200 క్యూసెక్కులే ఎత్తిపోస్తున్నారు. జిల్లా సరిహద్దుకు వచ్చే సరికి కేవలం 1330 క్యూసెక్కులు ప్రవహిస్తున్నాయి. జీడిపల్లికి వెయ్యి క్యూసెక్కులు దాటడం లేదు. ప్రస్తుతం కాలువ వెడల్పు 10 మీటర్లు.. దీన్ని 19 మీటర్లకు విస్తరించనున్నారు. దీంతో నిర్దేశిత 3850 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగే అవకాశం ఉంటుంది.

రెండో దశలో..

జీడిపల్లి నుంచి రెండో దశ ప్రధాన కాలువ మొదలవుతుంది. 216 కి.మీ. నుంచి 565 కి.మీ. దాకా ఉంది. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో రెండో దశ కాలువ పొడవు 274 కి.మీ. ఉంటుంది. సామర్థ్యం 2550 క్యూసెక్కుల ప్రవాహం ఉన్నా.. 1200 క్యూసెక్కులు వెళ్లడం గగనం అవుతోంది. ఇపుడు 921 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. రెండో దశలో సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. పూర్తయితే నిర్దేశిత 2550 క్యూసెక్కుల ప్రవాహం సులువుగా సాగుతుంది. పుంగనూరు, మడకశిర ఉప కాలువల పరిధిలోని చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వవచ్చు.

65 రోజులు.. 7.486 టీఎంసీలు

ఈఏడాది ఆగస్టు ఒకటో తేదీన నీటి ఎత్తిపోతకు శ్రీకారం చుట్టారు. 65 రోజుల్లో 7.486 టీఎంసీలే ఎత్తిపోశారు. 6.668 టీఎంసీలే జిల్లా సరిహద్దుకు చేరాయి. రోజూ 3వేల క్యూసెక్కులకు తగ్గకుండా ప్రవాహం కొనసాగి ఉంటే రెట్టింపు స్థాయిలో జలాలు జిల్లాకు చేరేవి. హంద్రీనీవా పరిధిలోని ఉమ్మడి కర్నూలు, అనంత, చిత్తూరు, కడప జిల్లాల పరిధిలో 6.02లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా ఒక్క ఉమ్మడి అనంత జిల్లా పరిధిలోనే 3.45లక్షల ఎకరాలు ఉంది.



కిందపడకుండా.. నష్టం రాకుండా

పుట్లూరు మండలంలో అరటిసాగు ఆశాజనకంగా కనిపిస్తోంది. అరటి చెట్టుకు వేసిన గెల క్రమేణా పరిమాణం, బరువు పెరిగి నేలకొరిగినా, కిందపడినా ఎక్కువగా నష్టం వాటిల్లే ఆస్కారం ఉంది. ఆ కారణంతో ఓ రైతు అరటిగెల బరువుకు వాలకుండా చెట్టు విరగకుండా పొడవైన కర్రలు దన్నుగా పెట్టి కాపాడుకుంటున్నాడు. కొంతమంది మొక్క చుట్టూ ఇనుప వైరు చుట్టి వాలకుండా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల అరటి గెల భారం పూర్తిగా చెట్టుపై పడదు. దీంతో చెట్టు ఒరగదు. పుట్లూరు మండలం కలువపల్లి, సంజీవపురం గ్రామాల అరటి తోటల్లో ఈ ఏర్పాట్లు కనిపిస్తాయి.

- ఈనాడు, అనంతపురం

7న ఎంబీఏ, ఎంసీఏ తక్షణ ప్రవేశాలు

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల సీట్లకు ఈ నెల 7వ తేదీన తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ కిరణ్మయి తెలిపారు. ఐసెట్-2024లో అర్హత సాధించిన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు ఏపీజే అబ్దుల్‌కలాం పరిపాలన భవనం వద్దకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ


ప్రత్యేక ప్రణాళికతో జిల్లా పురోభివృద్ధి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: విజన్-2047 లక్ష్యంగా దూరదృష్టి ప్రణాళిక తయారీ చేస్తూనే.. రానున్న ఐదేళ్లల్లో అన్ని రంగాల్లో జిల్లా పురోభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో 'విజన్ ఆంధ్ర-2047'పై సుదీర్ఘ సమాలోచనల సదస్సు జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక ప్రణాళికతోనే పురోగతి సాధ్యమన్నారు. వ్యవసాయం, జలవనరులు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, పరిశ్రమలు, నిరుద్యోగ నిర్మూలన, పట్టు పరిశ్రమ, మత్స్యసంపద, ఉద్యానవనం.. వంటి కీలక అంశాల ప్రాతిపదికన నివేదికలు తయారీ చేయాలని ఆదేశించారు. మొబైల్ యాప్‌లో తగిన సలహాలు ఇవ్వడానికి అవకాశం ఉందన్నారు. ఆ దిశగా అధికారులేకాదు మేధావులు, సామాజిక వేత్తలు, ఎన్జీఓ ప్రతినిధులు కూడా సలహాలు ఇవ్వాలని సూచించారు.

సంక్షేమ వసతిగృహాలకు మంచి రోజులు



రాయదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహంలో పనులు చేస్తున్న కార్మికులు



తక్షణ మరమ్మతులకు రూ.1.33కోట్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఎస్సీ సంక్షేమ వసతి గృహాలకు మహర్దశ రానుంది. జిల్లాలో అధ్వాన స్థితికి చేరిన 10 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాలల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇప్పటికే పనులు జరుగుతున్నాయి.

రూ.7కోట్లకు ప్రతిపాదనలు

జిల్లాలోని 51 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు, 9 రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రభుత్వం తనిఖీ చేయించింది. మరమ్మతులకు అధికారులు రూ.7కోట్లకు ప్రతిపాదనలు పంపారు. తక్షణ మరమ్మతులకు రూ.2 కోట్లు అవసరం అవుతాయని నివేదించారు. ప్రభుత్వం మొదటి దశలో 10 వసతి గృహాలు, ఒక రెసిడెన్షియల్ పాఠశాల మరమ్మతుకు రూ.1.33 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో గదుల పైకప్పులు, విద్యుత్తు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ తదితర పనులు చేపట్టనున్నారు. రాయదుర్గంలోని ఎస్సీ బాలుర సంక్షేమ వసతి గృహంలో అధ్వాన స్థితికి చేరిన గదులు, భోజనశాల పైకప్పులు పెచ్చులూడగా మరమ్మతులు చేస్తున్నారు.

పనులు వేగవంతం చేస్తాం

ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ నెలాఖరులోగా మరమ్మతులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. కురుగుంట రెసిడెన్షియల్ పాఠశాల పనులు చేపట్టాల్సి ఉంది. ప్రాధాన్యం పరంగా మరమ్మతులు చేయిస్తాం.

- దామోదర్‌రెడ్డి, ఎస్సీ సహాయ సాంఘిక సంక్షేమాధికారి, అనంతపురం



గుంతల మార్గంలో గుండె దడ!




నిత్యం వేలాదిగా ప్రయాణించే మార్గమది. ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. నగరంలో వర్షాలకు పడిన గుంతలు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెప్పిస్తున్నాయి. టవర్‌క్లాక్ నుంచి ఆర్ట్స్ కళాశాల వెళ్లే మార్గంలో ఇటీవల వర్షాలకు గుంతలు పడి నానాటికి ప్రమాదకరంగా మారుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. నీలం సర్కిల్ వద్ద అదే పరిస్థితి ఉంది. కనీసం ఇక్కడ గుంత ఉందన్న స్పృహ కలిగేలా ఏదైనా హెచ్చరిక బోర్డుఅయినా ఉంచలేదు. స్థానికులే ఇలా రాళ్లు అడ్డుపెట్టారు. .అది కూడా ప్రమాదకరంగా ఉన్నాయి.

- ఈనాడు, అనంతపురం

అనంత డీఎఫ్‌వోగా విఘ్నేష్

అనంతపురం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా అటవీ అధికారిగా ఎ.విఘ్నేష్‌ను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న వినీత్‌కుమార్‌ను వైఎస్ఆర్ జిల్లాకు బదిలీ చేశారు. ఈమేరకు శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసింది. విఘ్నేష్ 2018 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారిగా తెలుస్తోంది. మార్కాపురం టైగర్ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను అనంతపురానికి బదిలీ చేశారు.



(c) eenadu

17 నుంచి ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు


క్రీడా పోటీల నిర్వహణపై చర్చిస్తున్న ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అనిత

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఎస్కేయూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలు ఈ నెల 17న డిసెంబరు 13 వ తేదీ వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో శుక్రవారం ఉపకులపతి ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశానికి ఎస్కేయూ ఇన్‌ఛార్జి వీసీ అచార్య అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇన్‌ఛార్జి వీసీ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి చేయాలన్నారు. అంతర్ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహణకు తగిన సహకారం అందిస్తామన్నారు. 17 నుంచి 19 వరకూ ఎస్ఎస్‌బీఎన్ కళాశాల మైదానంలో కబడ్డీ, బ్యాడ్మింటన్, జుడో, బాస్కెట్‌బాల్, ఫెన్సింగ్, తైక్వాండో నిర్వహించాలని నిర్ణయించారు. 26 నుంచి 28 వరకూ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వాలీబాల్, చదరంగం, బాల్ బ్యాడ్మింటన్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, నవంబరు 3 నుంచి 5 వరకూ గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో మహిళలకు బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, హాకీ, క్రికెట్ టేబుల్ టెన్నిస్ 8 నుంచి 10 వరకూ పురుషులకు గ్రూప్-సి జట్లకు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. డిసెంబరు 2 నుంచి 9 వరకూ అనంతపురం ఎస్వీ డిగ్రీ కళాశాలలో క్రికెట్ పోటీలు 11 నుంచి 13 వరకూ ఆర్ట్స్ కళాశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. స్పోర్ట్ బోర్డు కార్యదర్శి జెస్సీ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళా

JOBCOM ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాలోని నిరుద్యోగులు ఏదైనా డిగ్రీ, బి.టెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ పూర్తి అయిన వారికి గొప్ప SOFTWARE ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోండి.
తేది: 06-10-2024 ఆదివారం
ఉదయం 10-00 గంటలకు
అడ్రస్: నలంద డిగ్రీ కాలేజ్
రాంనగర్, అనంతపురం.
రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించండి:
సెల్: 9014255700, 9704456009











నలిగిన పసిహృదయాలు

● ఇసుక బండి కిందపడి ఒకరు.. తల్లిని చూడటానికెళ్తూ మరొకరు దుర్మరణం

నవ్వులతో మురిపించే చిన్నారులు క్షణాల వ్యవధిలో అనుకోని ప్రమాదం ఎదురై మృత్యుఒడికి చేరి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చారు. ఓ తండ్రి తన కుమారుడిని ఇసుక తెచ్చేందుకు బండిపై వెంట తీసుకెళ్లారు. మరో తండ్రి పనికి వెళ్లిన అమ్మను చూడాలని కుమారుడు పట్టుబట్టడంతో ఆటోలో వెంటబెట్టుకొని బయల్దేరాడు. ఈ రెండు ఘటనల్లో ఇద్దరు చిన్నారులను మృత్యువు బలిగొంది. ఒక చిన్నారి బండి టైర్ల కింద పడి నలిగిపోగా.. మరొకరు ఆటో నుంచి జారి పడి దుర్మరణం చెందారు. అప్పటి వరకు చలాకీగా గడిపిన బిడ్డలు.. విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ విషాద ఘటనలు కణేకల్లు, హిందూపురంలో శుక్రవారం చోటు చేసుకుంటున్నాయి.

కణేకల్లు: కణేకల్లులో నివాసం ఉంటున్న ఎర్రిస్వామి, శారద దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్దకొడుకు జశ్వంత్(6) ఒకటో తరగతి. ఎర్రిస్వామి దున్నపోతుల సాయంతో బండిపై ఇసుకను తెచ్చి విక్రయించేవారు. కుమారుడిని వెంటబెట్టుకొని వేదావతి హగరికి వెళ్లారు. చిన్నారి బండిపై కూర్చొని ఉండగా ఇసుకను లోడ్ చేశారు. దాన్ని సరి చేస్తుండగా బండి ముందుకు కదలడంతో పైన ఉన్న బాలుడు కింద పడ్డాడు. టైర్లు ఛాతీపై నుంచి వెళ్లడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. ఇంట్లో ఉంటే బతికేవాడు కదా.. ఎంత పని చేశావు దేవుడా అంటూ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోధించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమధు తెలిపారు. మాజీ ఉప సర్పంచి ఆనందరాజు, తెదేపా, కురుబ సంఘం నాయకులు బాధితులను పరామర్శించారు.


జశ్వంత్



చిన్నా

హిందూపురం, పరిగి: పరిగి మండలం కోనాపురానికి చెందిన సురేశ్, పావగడకు చెందిన నాగమణి దంపతుల కుమారుడు చిన్నా(5). తండ్రి ఆటో నడిపేవారు. తల్లి లేపాక్షి మండలం పులమతికి ఉపాధి హామీ పనులకు వెళ్లారు. శుక్రవారం ఉదయం తల్లిని చూడాలని చిన్నా గోల చేశాడు. దీంతో సురేశ్ ఆటోలో కుమారుడిని తీసుకొని వెళ్తుండగా హిందూపురం పట్టణం కొట్నూరు సమీపాన కుక్క అడ్డొచ్చింది. దాన్ని తప్పించేందుకు బ్రేకు వేయగా ఆటోలో ఉన్న బాలుడు జారి కిందపడ్డాడు. వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్, జ్ఞాన, సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రతినిధులు

అనంతలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే: అనంత నగరంలోని టవర్ క్లాక్ సమీపంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. సినీ హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, నభా నటేశ్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ యజమాని రమణతో కలిసి జ్యోతి వెలిగించారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సతీమణి జ్ఞాన, సోదరుడు పరిటాల సిద్ధార్థ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. సీఎంఆర్ సంస్థ 36వ బ్రాంచ్ అనంతలో ఏర్పాటు చేయటం అభినందనీయమని, ఇక్కడి ప్రజలకు ప్రయోజనకరమన్నారు.



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECC - (61058)
R.T.O. ఆఫీసు రోడ్డు, అనంతపురం - 515001

వాహనం అమ్మకం ఇ-వేలం కొరకు బహిరంగ ప్రకటన

బయాన మరియు డాక్యుమెంట్లు దాఖలుకు ఆఖరు తేది & సమయం 19-10-2024న సా॥ గం॥ 4.00

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఈ దిగువ తెలిపిన మా రుణగ్రహీతల వాహనం 21-10-2024న ఇ-వేలంనకు సంబంధించి కొటేషన్లు కోరబడుచున్నవి. ఈ వాహనమునకు RASMECC అనంతపురంనకు అనుబంధ వివిధ శాఖలు వారిచే ఆర్థిక సహాయం చేయటమైనది మరియు రుణగ్రహీతలు రుణాలు EMI సక్రమంగా చెల్లించుటలో విఫలమైనందున బ్యాంకులు వాహనం స్వాధీనం చేసుకోవటమైనది మరియు ఈ దిగువ తెలిపిన తేదీన వాహనం ఆన్ లైన్ వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించటమైనది.

వ. నెం.	రుణగ్రహీత పేరు & ఖాతా నెం.	వాహనం రిజిస్టర్డ్ నెం. & మోడల్ వివరణ	రిజర్వు ధర & బయాన	వేలం సమయం
1	అనుగుల ఇంతియాజ్ 42392917903	ఓమినీ బస్ VE కమర్షియల్ వాహనాలు ఐషర్ SKL PRO 3010 L STF BSVI సీటింగ్ కెపాసిటి: 41 AP39VD2717-2023	రూ. 22,50,000/- రూ. 2,25,000/-	ఉ॥ 11.00 గం॥ నుండి 11.30 వరకు

నిబంధనలు & షరతులు: 1 ఇ-వేలం 21-10-2024న ఎక్కడ ఉన్నది అక్కడ పద్ధతిపైన మరియు ఆన్‌లైన్‌లో నిర్వహించబడుతుంది. బ్యాంకు అనుమతి పొందిన సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ C1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెబ్ పోర్టల్ https://www.bankeauctions.com నందు వేలం నిర్వహించబడుతుంది. ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకం యొక్క బిడ్ ఫారమ్ (అనుబంధం-II, అనుబంధం-III), డిక్లరేషన్, ఆన్‌లైన్ వేలం సాధారణ నియమ నిబంధనలు కలిగిన ఇ-వేలం టెండరు డాక్యుమెంట్ https://www.bankeauctions.com నందు లభిస్తాయి. 2) అధీకృత అధికారికి తెలిసినంత వరకు చరాస్తులపై ఎటువంటి ఎంకేంబ్రెంసెస్ లేవు. అయితే బిడ్‌ను దాఖలు చేయుటకు ముందుగా, వేలం వేస్తున్న చర ఆస్తి / ఆస్తులు యొక్క ఎంకేంబ్రెంసెస్, హక్కునకు సంబంధించి మరియు క్లెయిమ్‌లు / హక్కు / బకాయిలు గురించి తమ స్వంత విచారణలను బిడ్డర్లు చేసుకోవలెను. ఇ-వేలం ప్రకటనకు మరియు బ్యాంక్ యొక్క ఏదైన నిబద్ధత లేదా ఏదైనా ప్రాతినిధ్యంగా పరిగణించబడదు. అధీకృత అధికారి / సెక్యూర్డ్ క్రెడిటర్ ఏదైనా మూడవ పార్టీ క్లెయిమ్‌లు / హక్కు /బకాయిలకు బాధ్యత వహించరు. 3) గెలుపొందిన బిడ్డర్ అమ్మకం మొత్తంలో 25% (10+15%) వెంటనే చెల్లించాలి మరియు మిగిలిన మొత్తాన్ని అమ్మకం తేది నుండి 7 దినములులోగా చెల్లించాలి. చెల్లింపు చేయుటలో విఫలమైనచో అమ్మకం రద్దు చేయబడుతుంది మరియు అప్పటి వరకు చెల్లించిన మొత్తం స్వాధీనం చేసుకోబడుతుంది. 4) వేలం రద్దు చేయుటకు / వాయిదా వేయుటకు బ్యాంకు హక్కు కలిగి ఉంటుంది. 5) 05-10-2024 నుండి 19-10-2024 వరకు ఉ॥ గం॥ 10.00 నుంచి సా॥ గం॥ 4.00 వరకు బ్యాంక్ పని వేళల్లో వాహనం తనిఖీ చేసుకోవచ్చును. సంప్రదించవలసిన నెం. 9492946359, 9666681372. 6) గెలుపొందిన బిడ్డర్ రిజిస్ట్రేషన్ పేరు మార్చుకొనుటకు బాధ్యత వహించాలి మరియు వాహనం రిజిస్ట్రేషన్ పేరు మార్చిన తర్వాత మాత్రమే వాహనం బ్యాంక్ అప్పగిస్తుంది. 7) రిజర్వ్ ధరలో 10% బయానాను AGM RASMECC, అనంతపురం వారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేదా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బుక్కరాయసముద్రం శాఖ, అనంతపురం ఖాతా నెం. 37608344961 IFSC కోడ్: SBIN0006108 నకు RTGS/NEFT/ ఫండ్ బదిలీ ద్వారా 19-10-2024న సా॥ గం॥ 4.00 లకు లేదా ఆలోగా చెల్లించవలెను. 8) బయాన చెల్లించిన తర్వాత ఈ క్రింది డాక్యుమెంట్లు / వివరాల కాపీలు 19-10-2024న సా॥ గం॥ 4.00 లేదా ఆలోగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా RASMECC, అనంతపురం వారికి స్వయంగా లేదా ఇమెయిల్ ద్వారా దాఖలి చేయాలి i) బయాన డిమాండ్ డ్రాఫ్ట్ / పే ఆర్డర్ ఒకవేళ RTGS/NEFT ద్వారా చెల్లించినట్లయితే, UTR నంబర్‌తో రసీదు. ii) పాన్‌కార్డ్, ID ప్రూఫ్ మరియు చిరునామా రుజువు యొక్క ఫోటోకాపీలు. అయితే, గెలుపొందిన బిడ్డర్ చేయాల్సి ఉంటుంది బిడ్ మొత్తము యొక్క 25% బ్యాలెన్స్ మొత్తాన్ని చెల్లించే సమయంలో ఈ డాక్యుమెంట్ల ఒరిజినల్స్ బ్యాంకునకు దాఖలు చేయాలి. iii) బిడ్డర్స్ పేరు సంప్రదించు నెం. చిరునామా, ఇ-మెయిల్ ID. iV) బయాన వాపసు చేయుటకొరకు బిడ్డర్ యొక్క A/c వివరాలు. V) బిడ్ పెంపుదల యొత్తం రూ.20,000/-. 9) ఇతర వివరాల కోసం అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC, అనంతపురం (ఫోన్ నెం.9618887862) ఈ-మెయిల్ ID: sbi.61058@sbi.co.in లేదా మెసర్స్ CITI అసోసియేట్స్, సంప్రదించు నెం: 9492946359, 9666681372. సర్వీస్ ప్రొవైడర్ మెసర్స్ C1 ఇండియా లిమిటెడ్. https://www.bankeauctions.com మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతంనకు సంప్రదించవలసిన వారి పేరు: పి.ధరణికృష్ణ, మొబైల్: 99481 82222, ఇమెయిల్ ID: dharani.p@c1india.com, సపోర్ట్ & బ్యాకప్ ఆఫీస్: సపోర్ట్ టీమ్, సంప్రదించు నెం. ల్యాండ్‌లైన్: 0124-4302021/22/23/24, మొబైల్: + 91-7291981124/ 1125/ 1126.10) రవాణా, స్టాంప్ డ్యూటీ/ GST రిజిస్ట్రేషన్ చార్జీలు మొదలైన వర్తించు అన్ని చార్జీలు గెలుపొందిన బిడ్డర్ మాత్రమే భరించాలి.

తేది: 04-10-2024
ప్రదేశం: అనంతపురం

సం/- అధీకృత అధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
RASMECC, అనంతపురం

రానున్న ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న ఐదు రోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంట వాతావరణ కేంద్రం శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. శని, ఆదివారాల్లో పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే రైతు, కూలీలు, గొర్రెలు, పశువులు కాపరులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వచ్చే ఐదు రోజుల జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 31.6 నుంచి 36.0 డిగ్రీలుగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు 21.0 నుంచి 22.6 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. వాయువ్యం దిశగా గాలులు గంటకు 2 కి.మీ.ల వేగంతో వీస్తాయన్నారు. ఉదయం పూట గాలిలో తేమ 83 శాతం, మధ్యాహ్నం 78 శాతం నమోదయ్యే సూచన ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే : బెదిరింపులకు నిరసనగా జిల్లా కేంద్రంలోని అన్ని కోర్టులలో న్యాయవాదులు శుక్రవారం విధులను బహిష్కరించారు. జిల్లా కేంద్రంలో న్యాయవాది నాగరాజును ఓ కేసులో కక్షిదారుడు పామిడిలో ఇటీవల బెదిరించాడు. ఈ మేరకు న్యాయవాదులందరూ విధులను బహిష్కరిస్తున్నట్లు తొలుత బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది. తీర్మానం మేరకు న్యాయవాదులను విధులను బహిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ.. న్యాయవాదిపై దాడి చేసిన కక్షిదారుడిపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆయుర్వేద వైద్యం పేరిట మోసం

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రాప్తాడు, న్యూస్‌టుడే : ఆయుర్వేద వైద్యం పేరుతో బంగారు ఆభరణాలు దొంగతనం చేసే అంతర్ జిల్లా దొంగను అరెస్టు చేసి అతని నుంచి 62.7 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొన్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. రాప్తాడు డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం గౌరిబిందనూరు తాలూకా నగరిగిరి గ్రామానికి చెందిన గంగన్న శివరాజు (32) శరీర నొప్పులకు సంబంధించిన నూనెల వ్యాపారం చేస్తూ ముసలి వాళ్ళను ఎంపిక చేసుకొని దొంగతనాలు చేస్తుండేవాడు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర, అనంతపురం జిల్లా ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్లలో ఇతనిపై కేసులు నమోదయ్యాయి. సెప్టెంబరు 30న అనంతపురం రూరల్ ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శివరామానాయుడుకు ఆయుర్వేద వైద్యం చేస్తానని పక్షవాతం లేకుండా చేస్తానని చెప్పి.. భార్య రామలక్ష్మిని నమ్మించి 52 గ్రాములు బంగారు ఆభరణాలు దొంగలించారు. 28 డిసెంబరు 2023న శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం అక్కంపల్లికి గ్రామానికి చెందిన హనుమక్కతో నిందితుడు ఆర్డీటీ సంస్థ నుంచి వచ్చినట్లుగా పరిచయం చేసుకొని బియ్యం, బ్యాడలు, మంచి నూనె, ఉచితంగా ఇప్పిస్తానని.. ఈ పథకం పేదవాళ్లకు మాత్రమేనంటూ మాయమాటలు చెప్పాడు. ఫొటో తీసే సమయంలో ఒంటి పైన నగలు పక్కన పెట్టమని చెప్పి ఆమె దృష్టి మరల్చి 12 గ్రాముల బంగారు నగలు దొంగలించారు. ఈ దొంగతనాలపై దృష్టి పెట్టాలని ఎస్పీ ఆదేశించడంతో డీఎస్పీ సిబ్బంది, ఇటుకలపల్లి పోలీసులు బృందంగా ఏర్పడి గంగన్న శివరాజును అనంతపురం రూరల్ ఉప్పరపల్లి పంచాయతీ పంగల్ రోడ్డులో శుక్రవారం అరెస్టు చేశారు.

డీఆర్‌డీఏ ఇన్‌ఛార్జి పీడీగా ఈశ్వరయ్య

అనంత సంక్షేమం: డీఆర్‌డీఏ-వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఈశ్వరయ్యను నియమించారు. ఇప్పటి దాకా ఇన్‌ఛార్జిగా ఉన్న ఓబుళమ్మ కడప జడ్పీ సీఈఓగా బదిలీ అయ్యారు. ఆయన డీఆర్‌డీఏలో అందరి కంటే సీనియర్‌గా ఉండటంతోపాటు ప్రస్తుతం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టరుగా విధులు నిర్వహిస్తున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

TENDER

అనంతపురం లేడీస్ క్లబ్ బిల్డింగ్ మరమ్మతులకు గాను ఆసక్తిగల వారి నుండి 11-10-24 @ 5 pm లోపల టెండర్లు కోరడమైనది. వివరాలకు M: 8341263618, 9849001580 కార్యదర్శి, లేడీస్ క్లబ్, అనంతపురం.

REAL ESTATE

PLOT FOR SALE

బళ్ళారి హైవే, అరవకూరు బస్‌స్టాప్ మెయిన్ రోడ్‌కు 20 సెంట్లు కలదు. కన్వర్షన్ అయిపోయింది. ఆసక్తిగల కొనుగోలుదారులు సంప్ర: 8639512663.

JOBS

హిందూపురంలో లేఔట్ సైట్లు మరియు ఇళ్ళు అమ్మడానికి సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతము + ఇన్సెంటివ్ ఇవ్వబడును. 9008930130

అరవింద్ ఇండస్ట్రీస్ ఫ్యాక్టరిలో సూపర్‌వైజర్‌గా పనిచేయుటకు డిగ్రీ చదివిన వ్యక్తులు కావలెను. (గుంతకల్ వారికి మాత్రమే) Contact No: 8179506127.

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం 18K. Cell: 91609 00024, 96404 00073.

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను/ పేషంట్స్‌ని / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం.18K . Cell: 96402 58899, 96404 68899.

FACULTY/ TEACHERS

WANTED Teacher Subject English Classes 3rd & 4th Looking for Qualified and Experienced Lady Teachers. Contact: 9985950555. Lakshmi Synergy School.

DRIVERS

అనంతపురం రామ్‌నగర్‌లో ఇంటి కొరకు కార్ డ్రైవర్ కావలెను, సంప్రదించండి (శ్రీనాథ్) ఫోన్: 95502 21809.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS
5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు
అనంతపురం 8008709788, 8008709784
గుంతకల్లు 9963804820
కళ్యాణదుర్గం 8008709785
ధర్మవరం 8008001769
హిందూపురం 8008001642
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

అనంతపురము నగరపాలక సంస్థ

ఆర్.సి.నెం. 1481/2022/ఎఫ్2 తేది: 4-10-2024

అనంతపురము నగరపాలక సంస్థ పరిధిలో గల ఆవుల యజమానుదారులకు ముఖ్య విజ్ఞప్తి. మీరు పోషిస్తున్న లేక మీ పరిధిలో ఉన్న ఆవులు మీ సంరక్షణలోనే ఉంచుకోవలెను. మీరు ఎట్టి పరిస్థితులలోను తమ ఆవులను వీధులలోకి , బహిరంగ ప్రదేశములలోనికి మరియు రోడ్లపైకి వదిలి వేయకూడదు. ఆవులు రోడ్లపై సంచరించుట వలన నగరంలో ట్రాఫిక్ సమస్యలు మరియు ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా చిన్నపిల్లలపై, వాహనదారులపై దాడి చేయుచున్నాయి.

కావున ప్రభుత్వ ఉత్తర్వులు మరియు ప్రజల భద్రత దృష్ట్యా ఆవుల యాజమాన్యులకు తెలియజేయడమేమనగా 10-10-2024 తేదీ నాటికి తమ ఆవులను నగరములో సంచరించకుండా దూర ప్రాంతాలకు తరలించవలెను. లేనిచో వాటిని కార్పొరేషన్ చట్టము 1955 మేరకు నగరపాలక సంస్థ వారే గోశాలకు తరలించడం జరుగుతుందని తెలియజేయడమైనది.

సం/- కమిషనర్, అనంతపురము నగరపాలక సంస్థ

రాయదుర్గం


•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ


మాట్లాడుతున్న అబ్కారీ ఎస్‌ఐలు

దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారికి డీడీలు, ఇతర అంశాల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు అబ్కారీ ఎస్‌ఐలు పవన్‌కుమార్, హరికృష్ణ తెలిపారు. శుక్రవారం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాయదుర్గం సర్కిల్ పరిధిలో 8 దుకాణాలు, పట్టణంలో 5, గుమ్మఘట్ట, డి.హీరేహాళ్, రాయదుర్గం గ్రామీణ మండలానికి ఒక్కో దుకాణం మంజూరైనట్లు చెప్పారు. ఒక్కో దుకాణానికి రూ.2 లక్షలు వెనక్కి రాని దరావత్తు చెల్లించి దరఖాస్తు చేసుకుంటే ఈనెల 11న అనంతపురంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు వివరించారు.

శేషవాహనంపై శ్రీవారు



కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెద్ద శేషవాహనంపై శ్రీవారు దర్శనమిచ్చారు. శుక్రవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజారోహణ, స్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

ఆదాయ ధ్రువపత్రాల అందజేత

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఆదాయ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకొన్న వారికి అందజేసినట్లు తహసీల్దారు భాస్కర్ తెలిపారు. ఈనెల 3న 'ఆదాయ ధ్రువపత్రాలు అందక అవస్థ' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం వెలువడింది. దీనికి అధికారులు స్పందించారు. నిరుద్యోగులు, విద్యార్థులు, పింఛన్‌దారులు మండల వ్యాప్తంగా సుమారు 365 వరకు దరఖాస్తు చేసుకోగా, వారందరికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందేలా చూశామన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఆలస్యమైందని చెప్పారు. మీ-సేవ, సచివాలయాల్లో ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందవచ్చని తెలిపారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శుక్రవారం పలువురు అధికారులు బాధ్యతలు చేపట్టారు. కళ్యాణదుర్గం విద్యుత్తుశాఖ పట్టణ ఏఈగా జయకృష్ణ, కుందుర్పి మండలం సర్వేయర్‌గా మున్వర్ బాషా, కళ్యాణదుర్గం ఎంపీడీవోగా రామచంద్ర, కళ్యాణదుర్గం రిసర్వే తహసీల్దార్‌గా కుళ్లాయప్ప, కళ్యాణదుర్గం ఎక్సైజ్ ఎస్‌ఐలుగా శ్రీలక్ష్మీ, గోపాల్‌రావులు, కళ్యాణదుర్గం మండల పరిషత్తు పరిపాలన అధికారిగా శివశంకర్, సీనియర్ అసిస్టెంట్‌గా వి.వి.నరసయ్య, రాయదుర్గం పురపాలక సంఘం మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా నారాయణరెడ్డి, ఉరవకొండ ఎంపీడీవోగా రవిప్రసాద్, కూడేరు ఎంపీడీవోగా కుళ్లాయిస్వామి, వజ్రకరూరు ఈవోఆర్డీగా దామోదర్‌రెడ్డి, వజ్రకరూరు మండలంలోని గ్రామ కార్యదర్శులు.. చాబాలకు నాగరాజు, కమలపాడుకు వెంకటేశులు, గంజికుంటకు లలితమ్మ, రాగులపాడుకు కృష్ణకుమార్‌రెడ్డి, వజ్రకరూరుకు మల్లయ్యలు బాధ్యతలు స్వీకరించారు.

- న్యూస్‌టుడే, బృందం,

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి నీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వడంలోనూ, సమస్యలు తీర్చడంలో అధికారులు నిర్లక్ష్య వైఖరిని విడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, డివిజన్ నాయకుడు రంగనాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని పంప్‌హౌస్ వద్ద చేపడుతున్న మెరుపు సమ్మె శుక్రవారం ఆరో రోజుకు చేరుకొంది. కార్మికులకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. నీటి పంప్‌లను బంద్ చేసి కార్మికులు సమ్మె చేపడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

8న ఉద్యోగ మేళా

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకుల కోసం ఉద్యోగమేళా నిర్వహించి, ఎంపికైన వారికి ఉచిత శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి వెంకట ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఆర్డీటీ సంయుక్తంగా మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. 19 - 32 వయస్సు కలిగి ఉండి, పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో హాజరు కావాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత బస్టాండులో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శనివారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. రూ.9 లక్షలతో ప్రహరీ, పార్కింగ్, విద్యుత్తు, సౌకర్యం, నీటి వసతి, ఏసీపీ క్లాడింగ్‌లను ఏర్పాటు చేశామన్నారు. అనంతపురానికి చెందిన అక్షయపాత్ర సంస్థ ప్రతిరోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని సరఫరా చేయనున్నట్లు వివరించారు.

నలుగురు నిందితులకు రిమాండ్

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం), మండలంలోని కల్యంలో గతంలో ఇరువర్గాల గొడవ పడటంతో కేసు నమోదు చేయడంతో శుక్రవారం ఒక వర్గానికి చెందిన నాగరాజు, శివన్న, లక్ష్మన్న, ఆనంద్‌లను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

బస్ పాసుల జారీ

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్ పాసులను గతంలోగా కౌంటర్లలోనే జారీ చేస్తామని డిపో మేనేజర్ సురేశ్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరిస్తున్నందున ఆన్‌లైన్‌లో బస్సు పాస్‌ల జారీని నిలిపివేశారన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు, పాసులతో ప్రయాణించే ప్రయాణికులు గమనించాలని కోరారు.

తాగునీటి పథకాలు పడకేశాయ్

● వ్యవసాయ బోర్లు, ట్యాంకర్లే దిక్కు ● ప్రజలకు తప్పని తిప్పలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: వేతనాల కోసం శ్రీరామరెడ్డి నీటి పథకం కార్మికులు మెరుపు సమ్మె చేపట్టగా, సత్యసాయి నీటి పథకానికి సంబంధించి పీఏబీఆర్‌లో మోటార్లు కాలిపోయాయి. ఫలితంగా పట్టణం, గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. దసరా పండగ వేళ ఇలా నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● శ్రీరామిరెడ్డి నీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో మెరుపు సమ్మె బాటపట్టారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 220 గ్రామాలు, రాయదుర్గం నియోజకవర్గంలో 162 గ్రామాలకు నీరు సరఫరా అవుతాయి. 196 మంది కార్మికులు పని చేస్తున్నారు.


కళ్యాణదుర్గం: సంపులోకి నీటిని నింపుతున్న ట్యాంకర్

● సత్యసాయి నీటి పథకానికి పట్టణంలోని 8 కాలనీలకు, నియోజకవర్గంలోని 93 గ్రామాలకు రోజు 60 లక్షల లీటర్ల నీరు సరఫరా అవుతుంది. పీఏబీఆర్‌లో ఉన్న మూడు మోటార్లు కాలిపోవడంతో గత వారం రోజులుగా సరఫరా ఆగిపోయింది.

●కళ్యాణదుర్గం పురపాలక పరిధిలోని 24 వార్డులు, నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఈ రెండు పథకాల నుంచి నీరు అందేవి. చాలా కాలనీలకు నీరు రాకపోవడంతో పట్టణ వాసులు అద్దె ట్యాంకర్లపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.

● గ్రామాల్లో కొన్ని పంచాయతీ నీటి పథకాలు ఉన్నా జనాభాకు సరిపోవడం లేదు. దీంతో సమీపంలోని వ్యవసాయ క్షేత్రాల్లో నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పట్టణంలో ప్రైవేట్ నీటి ట్యాంకర్లకు గిరాకీ పెరిగింది. గతంలో ట్యాంకరు నీరు రూ.500 ఉండగా, ప్రస్తుతం రూ.700 నుంచి రూ.750 వరకు పలుకుతోంది. దూరాన్ని బట్టి అద్దెను రూ.50 అదనంగా ఇవ్వాల్సి ఉంటుంది.


కొత్తూరు గ్రామ శివారులోని తొట్టెలో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్థులు

● పేద, మధ్య తరగతి ప్రజలు ట్యాంకర్లతో నీరు కొనలేని పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవన్‌ను వివరణ కోరగా.. పట్టణంలో తాగునీటికి సమస్య ఉన్నట్లు తన దృష్టికి వస్తే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామన్నారు. సత్యసాయి నీటి పథకం సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా పీఏబీఆర్‌లోని మూడు మోటార్లు చెడిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661, ఉరవకొండ: 8008573071

సమస్య: గొంచిరెడ్డిపల్లి ప్రధాన రహదారిలో గోతులు ఏర్పడి వర్షపు నీటితో అధ్వానంగా మారింది. **- పాలన్న**

సమాధానం: వెంటనే మట్టివేసి చదును చేస్తాం

- కవిత, పంచాయతీ కార్యదర్శి

సమస్య: సంతేకొండాపురం నుంచి మామడూరు వెళ్లే దారిలో ముళ్ల పొదలు పెరిగి ఇబ్బందిగా ఉంది. **- ఓబులేశ్**

సమాధానం: ముళ్లపొదలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం

- అనిత, పంచాయతీ కార్యదర్శి

సమస్య: పాలవెంకటాపురం పైదొడ్డిలో తాగునీటి ఇబ్బంది ఉంది. అదనపు పైపులైన్ వేయాలి. **- శివయాదవ్**

సమాధానం: సమస్యను పరిష్కరిస్తాం.

- సుబ్బరాయుడు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ - న్యూస్‌టుడే, బ్రహ్మసముద్రం

సంక్షేమ పథకాలపై మొగ్గు


సభ్యత్వ నమోదులో నాయకులు

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: భాజపా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దేవరాజ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని టీ కూడలిలో భాజపా సభ్యత్వ నమోదు చేపట్టారు. ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు దేశ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. నాయకులు ఆదినారాయణ, నరసింహమూర్తి యాదవ్, రామకృష్ణ, సుబ్రహ్మణ్యం, సునీల్, సుధాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి


లాల్‌మోహన్

కణేకల్లు, న్యూస్‌టుడే: అప్పుల బాధ, అత్త ఆస్తి దక్కదన్న మనస్తాపంతో మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామానికి చెందిన రైతు లాల్‌మోహన్ (43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కర్నూలు జిల్లా పెరవలిలో చోటు చేసుకొంది. ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా.. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పెరవలికి చెందిన లక్ష్మీదేవికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లావణ్యతో లాల్‌మోహన్ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మండలంలోని నాగేపల్లి సమీపంలో 18 ఎకరాల పొలం ఉంది. ఏటేటా పంట దిగుబడులు రాకపోవడం, ఇంటి అవసరాల కోసం రూ.18 లక్షల వరకు అప్పులున్నట్లు సమాచారం. ఆరు రోజుల కిందట అనారోగ్యంతో అత్త మృతిచెందారు. మూడు రోజుల కార్యక్రమం అనంతరం ఆస్తి పంపకాల విషయమై చర్చ జరిగింది. ప్రస్తుతం అత్త పేరున విలువైన ఇల్లు ఇతర ఆస్తులున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో గతంలోనే తనకున్న ఆస్తి ఇద్దరి కుమార్తెలకు సమానంగా పంచింది. అత్త ఆస్తిలో వచ్చిన వాటాతో అప్పులు తీర్చాలనుకున్న లాల్‌మోహన్‌కు అత్త మృతి అనంతరం చుక్కెదురైంది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనస్తాపంతో మూడు రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లా మద్దికెర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పిడుగు పడి ఎద్దు మృత్యువాత

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ ఎద్దు మృతిచెందిన ఘటన మండలంలోని దేవగిరి క్రాస్ వద్ద చోటు చేసుకొంది. వివరాల్లోకి వెలితే.. ఉంతకల్లు గ్రామానికి చెందిన రైతు నాగన్న దేవగిరి క్రాస్ వద్ద ఉన్న వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటుండగా మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడి వర్షానికి పిడుగు పడటంతో ఎద్దు మృతిచెందింది. రైతుతో పాటు పనికొచ్చిన కూలీలు అరగంట పాటు స్పృహ కోల్పోయారు. వెంటనే వారికి వైద్యసేవలు అందించారు. ఘటనా స్థలాన్ని వీఆర్వో వన్నూరప్ప, పశువైద్యాధికారి వెంకటరెడ్డి పరిశీలించారు. వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ

ఉరవకొండ, న్యూస్‌టుడే: కిరాణా దుకాణంలో చోరీ జరిగిన ఘటన ఉరవకొండలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని గవిమఠం పరిసరాల్లో దాసరి నరసింహులు కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి అనారోగ్యానికి గురవడంతో దుకాణంలో నిద్రించలేదు. రాత్రి పొద్దు పోయిన తర్వాత దుండగులు తాళాలు ధ్వంసం చేసి, దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. దుకాణంలో ఉంచిన చిట్టీ డబ్బులు రూ.4 లక్షలు చోరీకి గురయ్యాయని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పరిశీలించి, వివరాలను సేకరించారు. పక్కనే ఉన్న మరో రెండు దుకాణాల్లో కూడా చోరీకి యత్నించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యాయవాది రామ్మూర్తి మృతి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న రామ్మూర్తి (58) అనారోగ్యంతో మృతిచెందారు. గత వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో శుక్రవారం మృతిచెందారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామ్మూర్తి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

నేడు సభ్యత్వ నమోదుపై అవగాహన

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని తెదేపా కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా తెదేపా పట్టణాధ్యక్షుడు పసుపులేటి నాగరాజు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొంటారన్నారు.

మురుగు చేరి.. మడుగులా మారి



శెట్టూరు మండలంలోని చిన్నంపల్లిలో వీధులన్నీ నీటి నిల్వలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారాయి. నీటి కుళాయిల నుంచి వచ్చే వృథానీరు, వర్షపునీరు కలసి మడుగులను తలపిస్తున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు. దీంతో దోమల వ్యాప్తి పెరిగి రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కుళాయిలకు మూతలు లేకపోవడం, ప్రస్తుతం చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లపై మరింత నీరు చేరి దుర్వాసన వస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, శెట్టూరు**

సేవలు లేక.. నిరుపయోగంగా..



గతంలో బీఎస్ఎన్ఎల్ సేవలు సౌకర్యంగా ఉండేవి. పట్టణంలోని కళిక వీధిలో ఏర్పాటు చేసిన ఆ సంస్థకు చెందిన డీపీ పెట్టెలో సుమారు 70 ఫోన్, అంతర్జాల కనెక్షన్లు ఉండేవి. కొన్నేళ్లుగా వాటి సేవలు ఆగిపోయాయి. దీంతో పెట్టె అధ్వానంగా మారి అందులో ఉన్న వైర్లు బయటకు కనిపిస్తూ దిష్టిబొమ్మలా దర్శనమిస్తోంది. ఆ పెట్టె విషపురుగులకు ఆవాసంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. తొలగించాలని పలుమార్లు కోరుతున్నారు. ఈ విషయమై ఆ సంస్థ జేఈ నారాయణను వివరణ కోరగా పెట్టె తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం**

బోరు నీరు తీసుకునేదెట్లా?



కుందుర్పి మండలం తెనగల్లు కురుబవీధిలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే చేతిపంపు చుట్టూ మురుగు చేరి అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలోని వీధుల నుంచి మురుగు నీరు సీసీరోడ్లపై ప్రవహిస్తూ పక్కనే ఉన్న చేతిపంపు వద్ద నిల్వ ఉంటోంది. దీంతో పాచిపట్టి తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. నీరు పట్టుకునేందుకు అవస్థలు పడుతున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నిల్వలతో దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతున్నామన్నారు. తక్షణం అపరిశుభ్రతను తొలగించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ ఉరవకొండ జట్టు



ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌తో ఉరవకొండ జట్టు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: మూడురోజులుగా నిర్వహిస్తున్న కేంద్రస్థాయి ఆర్డీటీ గ్రామీణ అథ్లెటిక్స్ పోటీల్లో ఉరవకొండ ప్రాంత జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకుంది. ఉరవకొండ ప్రాంత క్రీడాకారులు మూడేసి చొప్పున స్వర్ణాలు, రజతాలు, ఒక కాంస్య పతకం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచారు. రెండో స్థానంలో మడకశిర ప్రాంత జట్టు నిలిచింది. మడకశిర జట్టుకు నాలుగు పసిడి, ఒకటి చొప్పున రజతం, కాంస్య పతకాలు దక్కాయి. మూడో స్థానంలో ఆదోని జట్టు ఒకటేసి చొప్పున స్వర్ణం, రజతం, కాంస్య పతకాలు సాధించింది. మూడురోజుల పాటు జరిగిన ఈ పోటీలు ఎట్టకేలకు ముగిశాయి. వర్షం కారణంగా ఉదయం ముగియాల్సిన పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. కార్యక్రమంలో ఆర్డీటీ డైరెక్టర్ కృష్ణవేణి, ప్రమీల, లక్ష్మణరావు, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తదితరులు హాజరై విజేతలకు ట్రోఫీలు, వ్యక్తిగత బహుమతులు ప్రదానం చేశారు.

మంత్రి ఆదేశాలతో నీటి సరఫరా


ట్యాంకర్ల వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

వజ్రకరూరు, న్యూస్‌టుడే: శ్రీరామరెడ్డి మంచినీటి పథకం కార్మికుల సమ్మె, పీఏబీఆర్‌లో మోటార్లు కాలిపోయి మండలంలోని చాబాల గ్రామానికి గత కొన్నిరోజులుగా నీటి సరఫరా ఆగిపోయింది. దీంతో గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా నెలకొంది. ఈ విషయాన్ని గ్రామ తెదేపా నాయకులు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గ్రామానికి ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ట్యాంకర్ల ద్వారా గ్రామస్థులకు నీటిని అందించారు.


రాయదుర్గం: రాజరాజేశ్వరి దేవిగా వాసవీమాత


ఉరవకొండ: వెలిగొండలో లక్ష్మీ దేవిగా భగళముఖి అమ్మవారు


ఉరవకొండ: పెన్నహోబిలంలో ఉద్భవలక్ష్మీదేవి


కళ్యాణదుర్గం: గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు


కళ్యాణదుర్గం గ్రామీణం: ధనలక్ష్మీదేవి అలంకరణలో..

ధనలక్ష్మీ.. నమోస్తుతే

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు.

- న్యూస్‌టుడే, బృందం


కణేకల్లు: లక్ష్మీదేవిగా వాసవీమాత


రాయదుర్గం గ్రామీణం: బొమ్మక్కపల్లిలో..


కళ్యాణదుర్గం గ్రామీణం: గాయత్రి దేవి అలంకరణలో..

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని టి.వీరాపురం అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సుగ్గులప్ప, మల్లికార్జున, హనుమంతు ద్విచక్ర వాహనంపై సొంత పనులపై రాయదుర్గం వచ్చారు. రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా అడవి పంది అడ్డు రావడంతో తప్పించబోయి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడటంతో రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుగ్గులప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు.

సమాచారమిస్తే.. చోరీలకు అడ్డుకట్ట

● ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై అవగాహన ● రక్షణ కల్పిస్తామంటున్న పోలీసులు

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: దసరా సెలవులు సందర్భంగా మీరు ఊరెళితే.. చోరీలు జరగకుండా ముందు జాగ్రత్తగా యాప్ ద్వారా సమాచారమిస్తే మీ ఇంటి భద్రతకు పూర్తి రక్షణ తమదేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. దొంగతనాలు అరికట్టేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ 2017లో ప్రతిష్ఠాత్మకంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ప్రారంభించింది. సరైన ప్రచారం లేకపోవడంతో చాలామంది నేటికీ ఈ యాప్‌ను వాడుకోవడం లేదని పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలు, కళాశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో బంధువులు, విహారయాత్రలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.



యాప్ ముఖచిత్రం

యాప్ వినియోగం ఇలా..

మీ చరవాణిలో గూగుల్ స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్ నెంబర్, చిరునామాతో నమోదు చేసుకుంటే రిజిస్ట్రేషన్ పూర్తి అవగానే ఐడీను భద్రపరచుకోవాలి. ఊరు, ఇతర దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే యాప్‌లో యూజర్ ఐడీ నమోదు చేసి తిరిగి వచ్చే సమయాలను టైప్ చేసి రిక్వెస్ట్ పోలీసు వాచ్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. సమాచారం అందుకున్న కంట్రోల్ రూమ్ పోలీసులు స్థానిక పోలీసుల సాయంతో చిరునామాలో వైఫై రూటర్ సెన్సార్‌తో పని చేసే మోషన్ కెమెరాలు, విద్యుత్ లేకపోయినా పని చేసేలా యూపీఎస్ ఏర్పాటు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. తాళం వేసిన ఇంట్లోకి అపరిచితులు ప్రవేశించడానికి ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా ఫొటోలు తీయడంతో పాటు అలారం ద్వారా కంట్రోలు రూం, స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం



గతంలో పట్టణంలో వరుసగా చోరీలు జరిగాయి. ప్రస్తుతం నిఘా పెంచాం. సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు 94409 01869 ఈ నెంబరుకు ముందుగానే సమాచారమిస్తే, ఈ యాప్ ద్వారా ఇంటికి భద్రత కల్పిస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- జయనాయక్, యూపీఎస్ సీఐ, రాయదుర్గం

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలి

ఉరవకొండ, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం ఇసుక విధానం అమలులో విఫలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరంగయ్య, రంగారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కృష్ణమూర్తి, సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం సీపీఎం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అచ్యుత్‌ప్రసాద్ అన్నారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం రీసర్వే ఉప తహసీల్దార్ కుళ్లాయప్పకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి రంగనాథ్, రఘు, నరేష్, హనుమంతు, రామచంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మల్లా ప్రభుత్వ భవనాలు


నిరుపయోగంగా భవనాలు

విడపనకల్లు (ఉరవకొండ): విడపనకల్లు మండలం గడేకల్లులో గ్రామ సచివాలయం, ఆర్‌ఎస్కే, హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలను ఒకే ప్రాంగణంలో నిర్మించారు. దాదాపు ఏడాది కిందట నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే వాటిని అందుబాటులోకి తీసుకు రావడంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చొరవ చూపలేదు. అక్కడ ఆరోగ్య కేంద్రాన్ని శిథిలావస్థలో ఉన్న భవనంలో నిర్వహిస్తున్నారు. నిత్యం పెచ్చులు ఊడి పడుతుండటంతో రోగులు, విధులు నిర్వర్తించడానికి ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల కిందట పెద్దఎత్తున పెచ్చులు ఊడి పడ్డాయి. సిబ్బంది, రోగులు అప్రమత్తమై పక్కకు జరగడంతో ప్రమాదం తప్పింది. ఇక్కడ ఆర్‌ఎస్కేను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అందులో విద్యుత్తు, ఇతర మౌలిక సదుపాయాలు లేవు. గ్రామ సచివాలయాన్ని గతంలో ఎప్పుడో నిర్మించిన పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నారు. అక్కడ సేవలు పొందడానికి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి, నిర్మించిన భవనాలు మాత్రం దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. అక్కడి భవనాల మీద గుత్తేదారు మట్టి కుప్పలను అలాగే వదిలేయడంతో దానిపై గడ్డి పెరిగి, భవనాల నాణ్యత దెబ్బతింటోంది. దీనిని విడపనకల్లు మండల పీఆర్ ఏఈఈ వీరేశ్ దృష్టికి తీసుకెళ్లగా విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

పంట కాలువలకు నీటి విడుదల



ఐదో ఉపకాలువకు సాగునీరు విడుదల చేస్తున్న తెదేపా నాయకులు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: ఎంతోకాలంగా రైతులు ఎదురుచూస్తున్న పంటకాలువలకు 1.5 టీఎంసీల సాగునీరును శుక్రవారం తెదేపా నాయకులు విడుదల చేశారు. ఐదో ఉపకాలువ గ్లేట్లకు పూజలు చేసి నీరు విడుదల చేశారు. మండల కన్వీనర్ పాండుతో పాటు మండల మాజీ అధ్యక్షుడు ముంటిమడుగు శ్రీనివాస రెడ్డి, వివిధ గ్రామాల తెదేపా నాయకులు, హెచ్చెల్సీ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం తేలితే చర్యలు



వైద్యుడు, నర్సును విచారిస్తున్న జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి

నార్పల, న్యూస్‌టుడే: నార్పల ప్రభుత్వ వైద్యశాలలో గురువారం సూదిమందు వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటనపై జిల్లా వైద్యాధికారి భ్రమరాంబదేవి శుక్రవారం విచారణ చేపట్టారు. శుక్రవారం ఆమె వైద్యశాలలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, సాప్‌నర్సుతో మాట్లాడారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాల సేకరించారు. పూర్తి విచారణ అనంతరం వైద్య సిబ్బంది నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తాడిపత్రి గ్రామీణ ఎస్సైగా ధరణిబాబు

తాడిపత్రి, న్యూస్‌టుడే : తాడిపత్రి గ్రామీణ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా ధరణిబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా సత్యసాయి జిల్లా తనకల్లు మండలం నుంచి వచ్చినట్లు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన సాగర్ నార్పలకు వెళ్లగా అతని స్థానంలో ధరణిబాబు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన తాడిపత్రి పట్టణ ఎస్సైగా విధులు నిర్వహించారు.

'ఇసుక ఉచితంగా ఇవ్వాలి'

తాడిపత్రి, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో ఇసుక ధరలను ఇష్టానుసారంగా పెంచి కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారని, అన్ని ధరలు పెరిగాయని, ఇసుకను ఉచితంగా ఇవ్వాలని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దార్ రజాక్‌వలీకి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, రామ్మోహన్, శ్రీరాములు పాల్గొన్నారు.

కిక్ కొట్టారంటే.. పతకాలే

ఆత్మరక్షణ విద్యలో రాణిస్తున్న విద్యార్థులు



తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రికి చెందిన విద్యార్థులు యుద్ధవిద్య కరాటే అత్యుత్తమంగా రాణిస్తున్నారు. బడి వయస్సులోనే ఆత్మరక్షణ విద్యపై ఆసక్తి పెంచుకుని అందులో మెలకువలు నేర్చుకుంటున్నారు. ప్రతిభతో జిల్లా, రాష్ట్ర స్థాయి స్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటుతున్నారు.

జోనల్ స్థాయిలో సత్తా



తాడిపత్రిలోని చేనేత కాలనీకి చెందిన మునిస్వామి, అనురాధ దంపతుల కుమారుడు **పవన్‌కుమార్.** ఇతను ప్రకాశం పురపాలిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా కరాటేలో శిక్షణ తీసుకుంటూ మెలుకువలు నేర్చుకుంటున్నాడు. జిల్లాస్థాయి, జోనల్ స్థాయిలో సత్తా చాటి నాలుగు పతకాలు సాధించాడు. జాతీయస్థాయి ఫైటింగ్ విభాగంలోనూ 3 బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే తన లక్ష్యమని చెబుతున్నాడు పవన్‌కుమార్.

పంచ్ పడిందంటే విజయమే



తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన విద్యార్థి **ప్రణీత్‌కుమార్** శివరాముడు, రాజేశ్వరి దంపతుల కుమారుడు. ప్రైవేట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. కరాటేలో బరిలోకి దిగి ప్రత్యర్థిపై పంచ్ కొట్టిందంటే పతకం రావాల్సిందే. రెండేళ్లుగా కరాటే నేర్చుకుంటూ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో మూడు బంగారు పతకాలు, ఒక వెండి పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నట్లు విద్యార్థి చెబుతున్నాడు.

అంతర్జాతీయ పోటీలే లక్ష్యం



తాడిపత్రిలోని కటికవీధికి చెందిన శ్రీకాంత్, సుమలత కుమారుడు **గౌతమ్ రాజు.** ఐదో తరగతి చదువుతున్నాడు. తన కిష్టమైన కరాటేను నేర్చుకుంటూ పతకాల పంట పండిస్తున్నాడు. విజయవాడ, మచిలీపట్నం, తిరుపతిలో జరిగిన కరాటే జాతీయస్థాయి పోటీల్లో 3 బంగారు పతకాలు, కేతనకొండ, మంగళగిరిలో జరిగిన జాతీయస్థాయి కట్ట విభాగంలో రెండు రజత పతకాలు సాధించాడు. చదువుతోపాటు కరాటేలోనూ రాణిస్తున్నారు. ఆటలో మెలకువలు నేర్చుకొని అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించాలన్నదే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు విద్యార్థి తెలిపారు.

నిత్య సాధనతో ఆటపై పట్టు



తాడిపత్రిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఈశ్వరయ్య, సుజాతల కుమారుడు **లక్ష్మీనరసింహ.** పదో తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా కరాటేలో శిక్షణ తీసుకుంటున్నాడు. గతేడాది మంగళగిరి, మచిలీపట్నం, తిరుపతి నగరాల్లో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాడు. జాతీయస్థాయి కటాస్ విభాగంలో వెండి పతకాన్ని సాధించాడు. అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలని ఉందని విద్యార్థి చెబుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : తాడిపత్రిలోని యల్లనూరు రోడ్డు ఆఖరి వీధిలో భారీగా చెత్త పేకుపోయింది. **- కిషోర్, వాహనదారుడు**

సమాధానం : వీలైనంత త్వరగా క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తాం. **- శివరామకృష్ణ, కమిషనర్** - న్యూస్‌టుడే, తాడిపత్రి

అధికారుల బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోకు స్వాగతం పలుకుతున్న సిబ్బంది

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండల ఎంపీడీవోగా బారెన్‌సాహెబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పుట్టపర్తి జిల్లా కొత్తచెరువు నుంచి బదిలీపై రాగా ఇక్కడ పనిచేస్తున్న కుళ్లాయిస్వామి కూడేరు మండలానికి బదిలీ అయ్యారు. బారెన్‌సాహెబ్‌కు పెద్దవడుగూరు సర్పంచి వరలక్ష్మీతో పాటు పలువురు సన్మానించారు. ● ఈవోఆర్డీగా నరసింహారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఏవోగా విధులు నిర్వహిస్తున్న కేశవ బదిలీపై కూడేరు మండలానికి వెళ్లగా నల్లమాడ నుంచి రామచంద్రారెడ్డి బాధ్యతలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులుగా మేడిమాకులపల్లికి ప్రభాకర, మిడుతూరుకు ఆంజనేయులు, చిట్టూరుకు మధు బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో బారెన్‌సాహెబ్ తెలిపారు.

యాడికి, న్యూస్‌టుడే : ఎంపీడీవో కార్యాలయంలో పలువురు అధికారులు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. యాడికి ఎంపీడీఓగా వీర్రాజు, పామిడి నుంచి ఈఓఆర్డీగా శశికళ, యాడికి పంచాయతీ ఈఓ అశ్వర్థనాయుడు, పంచాయతీ రాజ్ ఏఈ యల్లమనాయుడు, కార్యదర్శులుగా నగరూరుకు మురళీకృష్ణ, కోనఉప్పలపాడు ప్రమీల, వేములపాడుకు మహేశ్వరరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

పామిడి, న్యూస్‌టుడే: పామిడి మండల నూతన ఎంపీడీఓగా తేజోళ్స్, కార్యదర్శిగా గోపాల్, జూనియర్ అసిస్టెంట్‌గా రవికుమార్, ఎద్దులపల్లి పంచాయతీ కార్యదర్శిగా వేణుగోపాల్, వంకరాజుకాల్వ పంచాయతీ కార్యదర్శిగా శివమూర్తి బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు.

కాత్యాయనిదేవిగా చౌడేశ్వరి



గుత్తిలో ధాన్యలక్ష్మిగా ..



యాడికిలో చాముండేశ్వరీ దేవి



క్రిష్టిపాడులో కాత్యాయనిదేవిగా..



కల్లూరులో మధుర మీనాక్షిదేవి

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో గురువారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధాన ఆలయాలన్నీ విద్యుత్తు దీపకాంతులతో అలరారాయి. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. -న్యూస్‌టుడే బృందం



పాత గుంతకల్లులో గాయత్రీదేవి పూజల్లో భక్తులు



గుంతకల్లు పట్టణం: మహాలక్ష్మీదేవిగా



తాడిపత్రి: అలంకరణలో అమ్మవారు



శింగనమలలో గాయత్రీదేవి

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు వినతి



మంత్రి లోకేశ్‌తో ఎంకే చౌదరి

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయించాలని స్థానిక తెదేపా అధ్యక్షుడు ఎంకే చౌదరి విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరారు. ఈమేరకు శుక్రవారం మంత్రిని అమరావతిలో కలిశారు. అనంతరం వారు మాట్లాడుతూ గుత్తి 1952 నుంచి నియోజకవర్గకేంద్రంగా ఉందన్నారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల స్థానికంగా అభివృద్ధి జరగలేదన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపీపీ సునీత అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బుక్కరాయసముద్రం, చెన్నంపల్లి, పసలూరు, చెదల్ల, దయ్యాలకుంటపల్లి దండువారిపల్లి తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు కార్యాచరణ రూపొందించాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, తహసీల్దారు పుణ్యవతి, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త కేంద్రంగా పాత ఆసుపత్రి



క్రిష్టిపాడులో నడిబొడ్డున ఉన్న పాత ఆసుపత్రి భవనంలోకి కొందరు వ్యక్తులు చెత్త వేస్తున్నారు. దీనివల్ల పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఇక్కడి ఆసుపత్రిని ఇరవైఏళ్ల కిందటే మరో ప్రాంతంలో నూతన భవనం నిర్మించి మార్చేశారు. పాతభవనం కాస్త చెత్త కేంద్రంగా మారింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి దామోదర్‌ను వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు.
-న్యూస్‌టుడే, పెద్దవడుగూరు

వివాదాస్పద పొలం పరిశీలన

గార్లదిన్నె, న్యూస్‌టుడే: యర్రగుంట్లకు చెందిన కళావతి పొలం ఏళ్లుగా ఓ రైతు ఆధీనంలో ఉంది. ఈ సమస్య పరిష్కరించేందుకు శుక్రవారం అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పొలం వద్దకు వెళ్లి సంబంధిత రికార్డులను పరిశీలించారు. తహసీల్దారు ఈరమ్మ, వీఆర్వో ఆదినారాయణ, పోలీసు సిబ్బంది, ఎస్సీ ఎస్టీ సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పాల్గొన్నారు.

స్థల వివాదంలో వ్యక్తిపై దాడి

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం గ్రామానికి చెందిన రామచంద్ర అనే వ్యక్తిపై స్థల వివాదంలో బంధువులు దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రామచంద్ర తండ్రికి పెద్దల ద్వారా సంక్రమించిన స్థలంలో పెద్ద ఏర్పాటుకు పనులు చేస్తుండగా చిన్నా సువర్ణమ్మ, వారి పిల్లలు రమేష్, చిన్న ఆంజనేయులు తనపై దాడి చేసి గాయపరిచారన్నారు.

హంపన్న త్యాగం అజరామరం

గుత్తి, న్యూస్‌టుడే : బ్రిటిష్ సిపాయిల నుంచి మహిళల మానప్రాణాలను కాపాడేందుకు ప్రాణాలను అర్పించిన గూళ్లపాళ్లెం హంపన్న సేవలు అజరామరమని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం హంపన్న వర్ధంతిని నిర్వహించారు. హంపన్న ఘాట్‌వద్ద పురపాలిక అధ్యక్షురాలు వన్నూరుబీ, హంపన్న ఘాట్ ప్రతినిధులు ఇస్మాయిల్, నాగేంద్రప్రసాద్, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు నివాళి అర్పించారు.

ఆదమరిస్తే అంతే సంగతులు



తాడిపత్రి నుంచి యల్లనూరు మీదుగా సింహాద్రిపురానికి వెళ్లే దారా దారుణంగా ఉంది. ఈమార్గం గుండా వెళ్లే పాతపల్లె వద్ద భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. రహదారి పలు చోట్ల అధ్వానంగా ఉన్నా ఎవరికీ పట్టడం లేదు. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే రహదారిలో 4వ వంతు భాగం పాడై పోయింది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, యల్లనూరు

కొత్త కల్వర్టుకు మోక్షమెన్నడో?



గుంతకల్లులోని హనుమేష్ నగర్‌లో శ్రీశంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాల వద్ద రహదారిపై కల్వర్టు పూర్తిగా దెబ్బతినింది. కల్వర్టుకు రెండు చోట్ల రంధ్రాలు పడ్డాయి. రాత్రి సమయంలో వాహన చోదకులు కింద పడుతున్నారు. కొత్త కల్వర్టు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.
-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

అనుమతుల్లేని లేఅవుట్లను కట్టడి చేస్తాం

తాడిపత్రి, న్యూస్‌టుడే : ఈ నెల 7న మున్సిపాలిటీ పరిధిలోని అక్రమ లేవుట్లను అరికట్టేందుకు రియాల్టర్లు, లైసెన్సు సర్వేయర్లు, స్టాంప్ రైటర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని పురపాలక కార్యాలయంలో సాయంత్రం 5.30 గంటలకు నిర్వహిస్తామన్నారు.

తెదేపా సీనియర్ నాయకుడి మృతి

శింగనమల : శింగనమల మండల తెదేపా సీనియర్ నాయకులు నెట్టికంటి అశ్వర్థనారాయణ(65) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయన మృతి పార్టీకి తీరని లోటని తెదేపా నాయకులు, కార్యకర్తలు తెలిపారు.

ఏమార్చి.. బంగారు నగ అపహరించి

గుత్తి : గుత్తిలోని కటిక బజార్‌లో ఓ బంగారం దుకాణంలో ఓ గుర్తుతెలియని అగంతకుడు బంగారు నగలు అపహరించాడు. గుప్తా జ్యూవెలరీ దుకాణంలోకి నగలు కొనుగోలు పేరుతో ఓవ్యక్తి శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. తనకు నగలు చూపాలని దుకాణం నిర్వాహకుడి కుమారుడిని కోరాడు. నగలు చూపిస్తుండగా ఏమార్చి 12 గ్రాముల బంగారు నగను బ్యాగులో వేసుకుని వెళ్లిపోయాడు. పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

ఆరుగురి అరెస్టు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి పట్టణ శివారులోని తిప్పారెడ్డిపల్లి రోడ్డు పక్కన జూదం ఆడుతున్న ఆరుగురిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ ఈరన్న తెలిపిన వివరాల మేరకు జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది కలిసి శిబిరంపై దాడులు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.46,200 నగదుతో పాటు, ఆరు చరవాణులను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బహిరంగ ప్రకటన

యిందుమూలముగ యావన్మందికి తెలియపరచడమేమనగా గుంతకల్లు నివాసియగు M.శిరీష, D/o M.శివశంకరయ్య ఋణ సౌకర్య నిమిత్తమై " BRK MA Co- Op Credit Society.LTD, ఆంధ్రబ్యాంకు రోడ్డు, గుంతకల్లు వారిని సంప్రదించి క్రింద కనపరిచిన షెడ్యూలు దాఖల గృహమునకు సంబంధించిన విక్రయ పత్రములలో ఒకటి ఒరిజినలు స్థిరాస్తి దాన శెటిల్‌మెంటు దస్తావేజుగా గుంతకల్లు S.R.O యందు T.గోవర్ధన్, S/o తమ్మినేని నాగప్ప గారి పేరిట Doc.No 2137/2004గా రిజిష్టరు కాబడిన దస్తావేజును తేదిన: 11-09-2024 S.L.V టాకీస్ రోడ్డు, జిరాక్స్ సెంటరు దగ్గరలో పోగొట్టుకొన్నారని ఎంత వెతికినా దాని ఆచూకి తెలియరాలేదని తెలుపడమైనది. కావున సదరు దస్తావేజు ఎవ్వరికైన దొరికియున్న గాని లేదా సదరు దస్తావేజు ఆధారంగా ఏమైనా తాకట్టు వ్యవహారము జరిగియున్న యెడలగాని, లేదా ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తగిన సాక్ష్యాధారులతో సంబంధిత " BRK MA Co- Op Credit Society.LTD, గుంతకల్లు వారికి గాని, లేదా క్రింద కనపరిచిన న్యాయవాది గాని ఈ ప్రకటన వెలుబడిన 10 రోజుల లోపుల తెలుపుకోగలరు. సదరు గడువు తేది లోపల ఎటువంటి ఫిర్యాదులు రాని యెడల సదరు స్థిరాస్తి దానసెటిల్‌మెంటు దస్తావేజు సంబంధించిన నకలు పత్రము ఆధారమున సదరు బ్రాంచి వారు ఋణ సౌకర్యము పత్రములు పరిశీలించి మంజూరు చేయుదురని తెలియపరచడమైనది.

షెడ్యూలు

అనంతపురం రి.డి, గుంతకల్లు సబ్‌డి చేరి తిమ్మనచర్ల గ్రామ Sy.No: 161-B, మహేంద్రవీధి, రెసిడెన్షియల్ ఏరియాలో, ప్రస్తుత వార్డు, 16 D.No 16/224-A asst No: 1003023397, R.C.C గల ఇంటికి హద్దులు. **తూర్పు:** రామోజి రాజశేఖర్ ఇల్లు, **పడమర:** T.M.రామాంజినేయుల షెడ్డు, **ఉత్తరం:** G.రంగయ్య ఇల్లు, **దక్షిణం:** 18 Ft రోడ్డు. **కొలతలు: తూర్పు-పడమర:** 20 Ft or 6.10 Mtrs, **ఉత్తరం-దక్షిణం:** 36 Ft or 10.98 Mtrs, వెరసి 80 చ॥లు లేక 67.2 Mtrs.

ఇట్లు: **N.గాదిలింగప్ప,** అడ్వకేటు, గుంతకల్లు. సెల్: 9849685853

ఆసుపత్రి పూర్వ సూపరింటెండెంట్‌పై విచారణ

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పూర్వపు సూపరింటెండెంట్, గైనకాలజిస్ట్ కమలపై గతంలో వచ్చిన ఆరోపణలపై శుక్రవారం కడప డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి విచారణ చేశారు. శుక్రవారం గుంతకల్లు ఏరియా ఆసుపత్రిలో విచారణలో భాగంగా డీసీహెచ్‌ఎస్ గదులను పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కమల ఉన్న సమయంలో అవకతవకలు జరిగాయని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు సురేష్ 2017లో పిటిషన్ వేశారు. ఈక్రమంలో ఉన్నత అధికారుల ఉత్తర్వుల మేరకు విచారణ నిర్వహించడానికి విచారణ చేపట్టారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు సిఫార్సు చేసుకుంటున్నారని ఆరోపించారు. మధ్యాహ్నం పూర్వపు సూపరింటెండెంట్‌ను, సాయంత్రం ఫిర్యాదుదారుడి సురేష్‌ను విచారించారు. ఇదే విషయంలో 2019లో విచారణ జరిగింది. తిరిగి మళ్లీ చేయాలని ఆదేశాలురావడంతో పూర్తి స్థాయి విచారణ చేపట్టారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు.



ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పూర్వ సూపరింటెండెంట్ కమలను విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ హిమదేవి

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కసాపురం రోడ్డులోని ఈడిగ కాలనీ వెనుక వీధిలోని రైల్వే ఉద్యోగి ఇంట్లో బంగారం, నగదు చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు రైల్వే ఉద్యోగిగా జయచంద్ర, భార్య సుమ మున్సిపాలిటీలో డీఈగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 30న ఇంటి నుంచి బయలుదేరి నాగపట్నంలోని మేరీమాత చర్చికి వెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటి చేరకొని ఇంటి ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూశారు. దొంగలు పడి బీరువాలోని 45 తులాల బంగారు, 20 తులాల వెండి, రూ.25 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. కసాపురం పోలీసులుకు ఫిర్యాదు చేయగా రూరల్ సీఐ మహేశ్వర్ రెడ్డి, కసాపురం ఎస్ఐ నరేంద్రకుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వడ్డీ వ్యాపారులపై చర్యలకు డిమాండ్



బాధిత కుటుంబ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న సాకే హరి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: రెడ్డిపల్లి గ్రామంలో వడ్డీ వ్యాపారుల వేధింపులతోనే మంగళవారం రాముడు అనే దళితుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సీ, ఎస్టీ ఐకాస అధ్యక్షుడు సాకేహరి ఆరోపించారు. వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు నాగమ్మ, ఆమె కుమారుడు రాకేష్‌తో కలిసి ఎపీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. దళిత సంఘాల ప్రతినిధులు నాగరాజు, మారుతి, రామాంజనేయులు, నరేష్, రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు శిథిలం

శింగనమల, న్యూస్‌టుడే : శింగనమల ఎస్సీ బాలికల వసతి గృహం గత పదేళ్లుగా ఖాళీగా ఉంది. భవనం చక్కగా ఉన్నా ఎవరూ లేక పోవడంతో శిథిలమవుతోంది. ఇతర కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలకు ఉపయోగపడే ఈ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఈకోవలోనే మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకొంది. ఈ కార్యాలయంలో ఉండలేక అధికారులు పాఠశాల భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఎమ్పీడీవో నిర్మలకుమారిని వివరణ కొరగా భవనాల దుస్థితిని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.



శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం

నీరు కలుషితమవుతున్నా పట్టదా?

గుంతకల్లు, న్యూస్‌టుడే : కృష్ణా జలాల్లోకి గుంతకల్లులోని మురుగునీరంతా కలుస్తోంది. గుంతకల్లు గుండా వెళ్లే గుత్తి ఉపకాలువలో హంద్రీనీవా కాలువ నుంచి వచ్చే నీరు ప్రవహిస్తోంది. ఇందులోకి వివిధ కాలనీల్లో నుంచి వచ్చే మురుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళ్లే దారిలోని మోరీగుండా గుత్తి ఉపకాలువలోకి వదులుతున్నారు. తద్వారా నీరు కలుషితమవుతోంది.

ఇదీ పరిస్థితి

కలుషిత జలాలు తిమ్మాపురం, నక్కనదొడ్డి, పాతకొత్త చెరువు తదితర గ్రామాల ప్రజలు వినియోగించుకోలేక పోతున్నారు. సమీపంలోనే కాలువ నీరు ప్రవహిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోతోంది. దీనివల్ల తాగు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. కాలువను పర్యవేక్షించే హెచ్చెల్సీ సర్కిల్ గుంతకల్లు డివిజన్ ఈఈ వెంకటరమణను వివరణ కోరగా కృష్ణాజలాలు కలుషితమవుతున్న మాట వాస్తవమే. ఇదంతా మున్సిపాలిటీ నుంచే జరుగుతోంది. దీనిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.



గుత్తి ఉపకాలువలోకి మోరీగుండా చేరుతున్న మురుగు

ఈ-పంట నమోదు తప్పనిసరి

శింగనమల, న్యూస్‌టుడే : రైతులు సాగు చేసిన పంటలను నిక్కచ్చిగా ఈ-పంటలో నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. సోదనపల్లి, కల్లుమడి గ్రామాల్లో ఈ-పంటలో నమోదు చేసిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారు సాగు చేసిన పంట వివరాలను తెలుసుకొన్నారు. పంట వివరాలు ఈ-పంటలో ఉంటేనే ప్రభుత్వ సహాయ, సహకారాలు రైతుకు అందుతాయని తెలిపారు. అనంతరం కల్లుమడిలో గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. తహసీల్దారు బ్రహ్మయ్య, గుత్తి వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు, ఉద్యానశాఖ అధికారిణి శైలజ, మండల వ్యవసాయధికారి అన్వేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు

ప్రాంతీయ కార్యాలయము: అనంతపురము
అంబేద్కర్ రోడ్, జిల్లాపరిషత్ ఎదురుగా, అనంతపురము

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ **తాడిపత్రి మెయిన్ శాఖను** ప్రస్తుతం ఉన్న శాఖకు సమీపంలోని యల్లనూర్ రోడ్డు, సిబి రోడ్డు మరియు సుంకులమ్మ పాలెంలో అన్ని వసతులు గల వేరొక భవనంలోనికి మార్చదలిచినాము.

ఇందు నిమిత్తము సుమారు **1400** నుండి **2000 చదరపు అడుగుల** కార్పెట్ ఏరియా గల కింది అంతస్తులోని భవనము (గ్రౌండ్ ఫ్లోర్) లేదా సొంత ఖాళీ స్థలంలో కింది అంతస్తులో భవనం (గ్రౌండ్ ఫ్లోర్) నిర్మించదలచిన వారు, **200 చదరపు అడుగుల మించి స్ట్రాంగ్ రూమ్** (రిజర్వ్ బ్యాంకు నియమ నిబంధనల మేరకు) మరియు పార్కింగ్ & నీటి సౌకర్యం కలిగి వున్న భవనము అద్దెకు కావలెను.

కావున ఆసక్తి గల వారి నుండి టెండర్ కోరడమైనది.

సాంకేతిక మరియు ఆర్థిక టెండర్ పత్రములు బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము నందు లభించును. పూర్తి చేసిన టెండర్లు, విడి విడి సీల్డ్ కవరులో ఉంచి, ఆ రెండింటినీ వేరొక కవరులో ఉంచి సీల్డ్ చేసి తేది **25-10-2024** లేదా అంతకన్నా ముందు, ప్రాంతీయ కార్యాలయము అనంతపురముకు చేరునట్లు పంపవలయును.

వివరములకు సంప్రదించండి: సెల్: 9490158012. ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము.

ఇట్లు: రీజనల్ మేనేజరు, అనంతపురము.
గమనిక: టెండర్లను ఏ దశలోనైనా రద్దు లేదా మార్పు చేసే అధికారము బ్యాంకు వారికి కలదు.

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

సెక్టోరియల్ పోస్టుల్లో అవకతవకలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారుల పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయి. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని జిల్లా ఎస్సీ,ఎస్టీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యుడు ఎల్లన్న కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. శుక్రవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. జీవో 2 ప్రకారం ఈ పోస్టుల భర్తీ జరగాలి. కానీ ఇప్పటికే పనిచేసిన వారికి, రీప్యాట్రేషన్ చేసిన వారిని కూడా ఇంటర్వ్యూకు పిలిచారు. మొత్తం 32 మంది వడపోతలో ఎంపిక అయినా.. కేవలం 14 మందినే ఇంటర్వ్యూలకు పిలిచారు. ఇందులో మతలబు ఉందన్నారు. అనేక అంశాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయిస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు.

ఎంపీడీఓ, ఈఓఆర్డీలు బాధ్యతల స్వీకారం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండల ప్రజాపరిషత్తు అధికారిగా పి.దివాకర్, ఈఓఆర్డీగా కె.వెంకట నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా వై.పుల్లయ్యను కర్నూలు జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. నార్పల ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.దివాకర్‌ను అనంతపురం గ్రామీణ ఎంపీడీఓగా నియమించారు. బ్రహ్మసముద్రం ఈఓఆర్డీగా పనిచేస్తున్న వెంకటనాయుడును అనంతపురం గ్రామీణ ఈఓఆర్డీగా నియమించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇద్దరూ బాధ్యతలు స్వీకరించారు. పలు గ్రామాల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వారికి స్వాగతం పలికారు. వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు.

డ్వామా పీడీగా సలీంబాషా

లక్ష్మీనగర్ (అనంతపురం): అనంతపురం జిల్లా డ్వామా పీడీగా సలీం బాషా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. కర్నూలు డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న ఆయనను పీడీగా నియమించి బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌ఛార్జి పీడీగా పనిచేస్తున్న విజయలక్ష్మి గుంతకల్లు డీఎల్‌డీవోగా బదిలీ అయ్యారు.

ఎస్కేయూ : కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా సత్యలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ప్రిన్సిపల్‌గా ఉన్న శంకరయ్య ఇటీవల పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా ఉన్న సత్యలత అనంతపురానికి బదిలీ వచ్చారు.

కేఎస్ఎన్‌లో తక్షణ ప్రవేశాలు

ఎస్కేయూ: కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ హానర్స్ కోర్సుల్లో ఖాళీ సీట్లకు ఈ నెల 7, 8, 9 తేదీల్లో తక్షణ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సత్యలత తెలిపారు. భైరవనగర్, ఆర్టీవో కార్యాలయం సమీపంలో కళాశాల వద్దకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ప్రవేశాలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

కాలనీ పచ్చగా ఉండాలని

• మురుగునీటిని సైతం మొక్కలకు మళ్లించి.. • ఆదర్శంగా నిలుస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి



పచ్చని మొక్కలతో మురుగు కాలువ పరిసరాలు

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే: మన ఇంటి ముందు శుభ్రంగా ఉంటే చాలు ఇతరుల గురించి మనకు ఎందుకు అనే ధోరణితో కాకుండా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే మనస్తత్వం అనంతపురం నగరం సెవెన్ హిల్స్ కాలనీకి చెందిన విజయ్‌భాస్కర్‌రెడ్డి. ఈయన కోర్టు ఉద్యోగి (స్టెనో గ్రాఫర్). ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ప్రాంతంలో 'క్లీన్ అండ్ గ్రీన్' పాటించాలని సంకల్పించారు. మొదట తన ఇంటి నుంచే ప్రారంభించి వీధుల్లో మొక్కలు నాటుతూ వాటికి నిత్యం నీరు పోస్తు రక్షిస్తున్నారు. మురుగు కాలువలు శుభ్రం చేసి, ఆ నీటిని మొక్కలకు పోస్తూ సంరక్షిస్తున్నారు. ఇలా కాలనీలో పచ్చదనం నింపుతూ ఆరేళ్లుగా అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు విజయ్‌భాస్కర్‌రెడ్డి. సెవెన్ హిల్స్ కాలనీ నుంచి హౌసింగ్ బోర్డుకాలనీ వరకు రోడ్డు అటు ఇటూ 2 కి.మీ పొడవునా మొక్కలను సంరక్షిస్తున్నారు. అభయాంజనేయస్వామి ఆలయం ముందు భాగంలో పూలమొక్కలు నాటారు. ఆలయానికి వస్తున్న మహిళలు పూలను కోసి పూజకు తీసుకెళ్తున్నారు. హౌసింగ్ బోర్డుకాలనీ ప్రాంతంలో పూల మొక్కలతో సుందరంగా తయారు చేశారు. సొంత ఖర్చులతో మురుగు కాలువల్లో చెత్తా చెదారం తొలగిస్తూ పలు పనులను చేపడుతున్నారు. రెండు అడుగుల మేర మురుగు కాలువ సక్రమంగా పారేలా గోడ నిర్మించారు. నిత్యం ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు కాలనీలో మొక్కలకు మురుగు కాలువ నీటి పోసి రక్షిస్తున్నారు. చెట్టు కొమ్మల నుంచి రాలిన ఆకులను మొక్కలకు ఎరువుగా వేసి, మొక్కల చుట్టు శుభ్రతను పాటిస్తున్నారు. ఇలా హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆరేళ్లుగా చేస్తున్న సేవలకు పచ్చదనం ఆకట్టుకుంటోంది. కాలనీ ప్రజలు విజయ్‌భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్నారు.

ప్రజల్లో చైతన్యం రావాలి



సమాజంలో ఆరోగ్యానికి మించిన సంపద ఏదీ లేదు. పరిశరాలను శుభ్రంగా ఉంచుకొంటేనే అది సాధ్యం . మొక్కలు పెరగాని కాలనీల్లో చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలి. నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన వాహనాల్లోను, లేక చెత్త బుట్టలోనో చెత్త వేసేలా ప్రజల్లో మార్పు రావాలి. క్లీన్ అండ్ గ్రీన్ ను ప్రతి ఒక్కరూ పాటించాలి. నా బాధ్యతగా నేను చేస్తున్నా. **- విజయ్‌భాస్కర్‌రెడ్డి, సెవెన్‌హిల్స్ కాలనీ.**

పచ్చదనంతో సుందరంగా ఉంది



2017లో మా కుటుంబం హౌసింగ్‌బోర్డు కాలనీకి వచ్చాం. అప్పల్లో ముళ్ల కంపల చెట్లతో సాయంత్రం సమయాల్లో బయటకు రావాలంటేనే భయాందోళనగా ఉండేది. ఎక్కడ చూసిన చెత్తా చెదారం దర్శనమిచ్చేది. విజయ్‌భాస్కర్‌రెడ్డి మా కాలనీకి వచ్చి కాలువల శుభ్రం చేసి మొక్కలు నాటారు. విజయ్‌భాస్కర్ రెడ్డి వల్లే అది సాధ్యమైంది **- గాయత్రి, హౌసింగ్‌బోర్డు**

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM) అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003



సమస్య : కమలానగర్‌లో జేకే కంప్యూటర్స్ సమీపాన వారం రోజుల క్రితం కొళాయి మరమ్మతుల కోసం గుంత తీశారు. మట్టిని పూడ్చకుండా వదిలేశారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- ఆనంద్, స్థానికుడు.**

సమాధానం : వెంటనే తరలిస్తాం.

- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్‌ఓ. – న్యూస్‌టుడే : కమలానగర్

కల్వర్టుకు మరమ్మతులు.. వీధుల్లో లైట్లు

అనంతపురం(గుల్జార్‌పేట), న్యూస్‌టుడే : అరవిందనగర్‌లోని మాజీ మేయర్ ఇంటి సమీపంలో కల్వర్టు మరమ్మతులేక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనపై ఈ నెల 3న 'ప్రమాదకరంగా కల్వర్టు' శీర్షికన ప్రచురితమైన చిత్ర కథనానికి నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

అనంతపురం (సూర్యనగర్): ప్రభుత్వ ఆసుపత్రి వెనుక భాగంలో రాత్రి పూట లైట్లు వెలగకపోవడంపై ఈ నెల 4న 'వెలగని లైట్లు.. వీధుల్లో చీకట్లు' శీర్షికన వార్త రావటంతో నగరపాలక అధికారులు స్పందించి విద్యుత్తు దీపం ఏర్పాటు చేశారు

ఈనాడు కథనానికి స్పందన

'లిబర్టీ' లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: విద్యా అవకాశాలు, సంక్షేమంపై విస్తృత అవగాహన కల్పించడానికి నెలకొల్పిన 'లిబర్టీ' విద్యా సమితి లోగోను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సదుపాయాలు, సంక్షేమంపై తగిన ప్రచారం చేయాలన్నారు. అన్ని రకాల సౌకర్యాలను అందిపుచ్చుకోవడానికి వారిలో అవగాహన పెంచాలని ఆయన అన్నారు. లిబర్టీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బండారు కుళ్లాయప్ప, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్-మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న, మాజీ సభ్యుడు ఎస్‌కే తిరుపాలు, ఎస్సీ, ఎస్టీ వేదిక నాయకుడు మీనుగ రామాంజనేయులు, లింగమయ్య పాల్గొన్నారు.





సందడే సందడి

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభ కార్యక్రమానికి నగరానికి విచ్చేసిన సందర్భంలో అభిమానులను ఉత్సాహ పరుస్తూ నృత్యం చేస్తున్న సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్. వీరిని చూసేందుకు అభిమానులు తరలివచ్చారు. – ఈనాడు, అనంతపురం

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు



పోస్టర్లు విడుదల చేస్తున్న విద్యాశాఖ మంత్రి లోకేశ్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ విద్యార్థులకు డిసెంబరులో ప్రతిభా పరీక్షలు, డీఎస్సీ అభ్యర్థులకు మాదిరి పరీక్ష నిర్వహిస్తున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి తెలిపారు. వదాన్య ప్రతిభా పరీక్షలకు సంబంధించిన పోస్టర్లను విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ప్రతి సంవత్సరం గ్రామీణ ప్రాంతాల్లోని జడ్పీ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అశోక్ తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు, ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం డిసెంబరులో ప్రతిభా పరీక్షలు నిర్వహించి, జనవరిలో బహుమతులు అందజేస్తామన్నారు. ఉమ్మడి అనంత జిల్లాలోని డీఎస్సీ ఎస్జీటీ అభ్యర్థులకు మాదిరి పరీక్ష నిర్వహిస్తామన్నారు.



సీఎంకు రూ.5లక్షల డీడీ అందజేస్తున్న ఉమ్మడి అనంత జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం నాయకులు

వరద బాధితులకు రూ.5 లక్షల సాయం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: వరద బాధితులకు ఆదుకునేందుకు ఉమ్మడి అనంత జిల్లా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం మానవత్వం చాటుకొంది. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రూ.5 లక్షల డీడీని ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుక్రవారం అందజేశారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రవిచంద్రారెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవేంద్ర, భాస్కరరెడ్డి, చిత్తయ్య పాల్గొన్నారు.

జననీ.. శుభకారిణి




పాతూరులో బాలాత్రిపురసుందరిగా దర్శనమిస్తున్న అమ్మవారు...



దర్శించుకుంటున్న జిల్లా జడ్జి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు



రామచంద్రనగర్ శిర్డీ సాయి బాబా ఆలయంలో కుంకుమార్చన



ఉమానగర్ రేణుకా యల్లమ్మకు గవ్వలతో అలంకారం



పంపనూరులో ..



హెచ్ఎల్‌సీ కాలనీలో

శరన్నవ రాత్రి ఉత్సవం శోభాయమానంగా సాగుతోంది. రెండోరోజు శుక్రవారం కావడంతో జగజ్జనిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. మూల విగ్రహాలను, ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లాలోని పలు ఆలయాల్లో ఉత్సవ శోభ మిన్నంటింది. పలు ప్రాంతాల్లో కొలువు దీరిన దేవతామూర్తులను దర్శించుకొన్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో పలు రకాల పూజలు చేశారు. సాయంత్రం వేళల్లో అమ్మవారి అలంకరణ విశేషంగా ఆకట్టుకున్నాయి. పలు ఆలయాల్లో చిన్నారులు నృత్యాలతో ప్రత్యేకంగా అలరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు ఆలయాల్లో మహిళలు కుంకుమార్చన చేశారు. **- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం, కమలానగర్, ఆత్మకూరు**



శివకోటి దేవాలయంలో కుంకుమార్చన



పాతూరు అమ్మవారిశాలలో చిన్నారుల నృత్యప్రదర్శనలు..

యువతిని వేధించిన యువకుడిపై పోక్సో కేసు

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: యువతితో స్నేహంగా నటిస్తూ ఆమె వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు సేకరించి.. తర్వాత తన కోరిక తీర్చాలని వేధిస్తోన్న యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం... అనంతపురం జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన లోకేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతిని పరిచయం చేసుకున్నాడు. 2022లో యువతి ఇంటర్ చదువే సమయంలో చనువు పెరగడంతో యువతి ఫొటోలను, వీడియోలను అతడికి పంపింది. 2023 వేసవిలో యువకుడు నగ్నంగా నిల్చొని వీడియోకాల్‌లో మాట్లాడాలని, తన కోరిక తీర్చాలని వేధించాడు. లేకుంటే తన వద్ద ఉన్న వ్యక్తిగత ఫొటోలను బంధువులకు, స్నేహితులకు పంపుతానని బెదిరించాడు. 2023 జులైలో యువతికి, ఆమె సోదరుడికి, సమీప బంధువుకు వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు పంపాడు. ఫోన్ నంబరు మార్చుకోవాలని ఆమె సోదరుడు సూచించడంతో ఫోన్ నంబరు మార్చింది. తర్వాత ఇన్‌స్టాగ్రామ్ వాడుతోందని తెలుసుకున్న లోకేష్.. అమ్మాయి పేరుతో నకిలీ ఐడీని సృష్టించి స్నేహం చేశాడు. అప్పుడు లోకేష్ మరలా తన నిజ స్వరూపాన్ని చూపుతూ తనవద్ద వద్ద వ్యక్తిగత వీడియోలు ఉన్నాయని యువతికి చెప్పి, ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశాడు. అతని బాధలు భరించలేక యువతి ఈనెల 2న ఆత్మహత్య చేసుకోవడానికి ట్యాంక్‌బండ్ వెళ్లింది. అక్కడికి వెళ్లాక మనసు మార్చుకుని తన సోదరుడికి వివరించింది. సోదరుడు లోకేష్‌కు ఫోన్‌చేసి అడగ్గా, తనకు తెలియదని బహుశా తన స్నేహితుడు అప్‌లోడ్ చేసి ఉంటాడని బుకాయించాడు. అనంతరం మళ్లీ ఫోన్ చేసి ఫొటోలను తొలగించానని చెప్పాడు. బాధిత యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రీ, కుమారుల అదృశ్యం

అనంత నేరవార్తలు: ఐదేళ్ల కుమారుడితో తండ్రి అదృశ్యమైన ఘటన నగరంలో చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిండికేట్‌నగర్‌కు చెందిన తిరుపాల్, లక్ష్మీదేవిలు భార్యభర్తలు. వీరికి ఐదేళ్ల కుమారుడు రాజ్‌కుమార్ ఉన్నాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయి వేర్వేరుగా ఉంటున్నారు. కుమారుడు తల్లి వద్దే ఉండేవాడు. అతన్ని చూడటానికి రాజీవ్ కాలనీ పంచాయతీ టీచర్ రామయ్య కాలనీ ఉంటున్న భార్య ఇంటికి తరచూ వెళ్తుంటాడు. ఆ క్రమంలోనే గత నెల 29న ఇంటి వద్దకు వెళ్లి పండగకు కొత్త దుస్తులు కొనిస్తానని కుమారుడిని తీసుకుని వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. భార్య పలు చోట్ల గాలించింది. ఫలితం లేకపోవడంతో మూడో పట్టణ పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేసింది.

రాప్తాడు నూతన ఎంపీడీవోగా విజయలక్ష్మి

రాప్తాడు: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ బదిలీల్లో భాగంగా తాడిమర్రిలో పని చేస్తున్నా ఎంపీడీవో విజయలక్ష్మి బదిలీపై శుక్రవారం రాప్తాడు నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కృషి చేస్తామని తెలిపారు.

ఏబీవీపీ ప్రాంత సభ్యుడిగా హరిప్రసాద్‌నాయక్

ఎస్కేయూ : ఏబీవీపీ ప్రాంత సభ్యుడిగా అనంతకు చెందిన ఎం.హరిప్రసాద్‌నాయక్ ఎంపికయ్యారు. విజయనగరంలో ఇటీవల జరిగిన జనజాతి విద్యార్థుల సమ్మేళనంతో ఆయనను సభ్యుడిగా ఎంపికచేశారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎస్కేయూ రిజిస్ట్రార్ రమేష్‌బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎస్కేయూ సమస్యలు పరిష్కరించాలి

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి నిధులు మంజూరు చేసి, వర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలు రిజిస్ట్రార్ రమేష్‌బాబు చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణయ్య మాట్లాడుతూ వర్సిటీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉద్యోగాలు భర్తీ చేయాలనే అంశంపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. నూతన జాతీయ విధానంతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యమవుతోంది. ఎన్ఈపీ రద్దు చేయాలని సమావేశాల్లో చర్చిస్తామన్నారు. ఎస్కేయూలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర మహాసభల దృష్టికి తీసుకెళ్తామన్నారు. విద్యార్థి సంఘం నాయకులు సాయిమహేష్, శ్రీనునాయక్, జ్యోతి, మహేష్ బాబు, మణిమాల పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : ఎన్డీయే కూటమి ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని శుక్రవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మైనింగ్ డీడీ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభ్యం కాక ధరలు పెరిగి, విచ్చలవిడిగా అవినీతి పెరిగిపోయి ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందని.. దానివల్లనే గత ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరాపై నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో ఇసుక లభించడం లేదని, రవాణా ఛార్జీలు, ఇతర పేర్లతో ఇసుక ధరలు గత ప్రభుత్వం తరహాలోనే ఉన్నాయన్నారు. ఇది ఏ మాత్రం ప్రజలకు ఉపయోగపడటం లేదన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, నాయకులు

ప్రస్తుతం ఇసుక లభించడం కష్టంగా మారిందని, కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని ఆయన కోరారు. సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి, నగర కమిటీ సభ్యుడు వెంకటనారాయణ, ప్రకాశ్, మసూద్, వలీ, రాజు, గపూర్ ,శీనా, జీవా పాల్గొన్నారు.

కార్మికులు ఉపాధి కోల్పోయారు

ఆత్మకూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివశంకర కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించక భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని వివరించారు. ఇసుకకు డిమాండ్ ఎక్కువ ఉండి ధరలు పెరగడంతో సామాన్యులు ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చిందని వివరించారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **సత్యం సుందరం,** గాయత్రి : **రామ్‌నగర్ బన్నీ,** గౌతమి : **కలి, మిస్టర్ సెలబ్రిటీ,** గౌరి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ : **దేవర,** తరంగిణి : **దక్షిణ,** తేజస్విని : **స్వాగ్.**

22వ వర్ధంతి



మా జీవిత గమ్యాలకు మార్గదర్శకులుగా మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసిన మీరు దైవ సన్నిధికి చేరి నేటికి 22 సంవత్సరములు గడిచిననూ మీ జ్ఞాపకాలు మేము ఎప్పటికీ మరువజాలం. భగవంతుని సన్నిధికి చేరిన పవిత్రమైన మీ ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ... మీ..

కీ॥శే॥ పి.నాగప్ప గారు
Rtd. Employment Officer
అనంతపురం. మరణం: 05-10-2002

భార్య: కీ॥శే॥ పి.నాగమ్మ
కుమారులు - కోడళ్లు
కుమార్తెలు - అల్లుళ్లు
మనుమళ్లు, మనుమరాళ్లు
D.No.1/1439, రాంనగర్ Extension
అనంతపురం.

చెత్త తరలించండి

హౌసింగ్‌బోర్డు కాలనీల్లో ఏ వీధి చూసిన చెత్తా చెదారంతో దర్శనం ఇస్తున్నాయి. ఇళ్ల ముందు రోడ్డుపై సైతం పిచ్చిమొక్కలు పెరిగాయి. కాలనీల్లో ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి విషపురుగులు సంచరిస్తున్నాయి. కాలనీల్లో ప్రజలు సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఉంది. ప్రజాప్రతినిధులు పర్యటన ఉంటే తప్ప కాలనీల్లో రోడ్లు శుభ్రంగా కనబడటం లేదు. రోడ్డుపై చెత్తా చెదారం సకాలంలో తరలించక కాలువల్లోకి పడిపోతోంది. మురుగు నిలిచిపోతోంది. తీవ్ర దుర్వాసనతో కాలనీలో ముక్కుమూసుకొని వెళ్లే పరిస్థితి ఉంది. **- న్యూస్‌టుడే, కమలానగర్**



కృష్ణమ్మ గలగల.. చెరువులకు జలకళ

• 25 రోజుల్లోనే నిండిన వైనం
• పచ్చగా మారిన బీడు భూములు



నిండుకుండలా ఆత్మకూరు మండలం మదిగుబ్బ చెరువు

ఆత్మకూరు, రాప్తాడు, చెన్నేకొత్తపల్లి, న్యూస్‌టుడే: దశాబ్ద కాలం క్రితం వరకూ రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిస్తేనే చెరువులు నిండే పరిస్థితి. అడపా దడపా కురిసే వర్షాలకు చెరువుల్లో అంతంత మాత్రమే నీరు నిల్వ ఉండేది. చెరువు నీటిపైనే ఆధారపడి వేల ఎకరాల ఆయకట్టు సాగు ఆధారపడి ఉంది. చెరువులు నిండకపోవడంతో ఆయకట్టు ఏళ్లకేళ్లు బీడులుగా మారి ముళ్లకంపలతో అడవులను తలపించేవి. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న తెదేపా ప్రభుత్వం ప్రత్యేక చొరవతో హంద్రీనీవా కాలువను పూర్తి చేసి కృష్ణా జలాలను మాల్యాల లిఫ్ట్ నుంచి తీసుకుచ్చారు. అక్కడి నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు చేరి, అక్కడి నుంచి ప్రధాన కాలువ నుంచి ఉపకాల్వల ద్వారా ఉమ్మడి జిల్లాలోని చెరువులకు నీరందించారు. వైకాపా పాలన సాగిన ఐదేళ్లు ఏ చెరువుకూ నీరందనే లేదు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రస్తుతం చెరువులకు నీరు చేరుతోంది. వర్షపాతం లోటు కొనసాగుతున్న క్రమంలో కృష్ణాజలాల రాక రైతుల్లో ఆనందం నింపుతోంది.

❒ రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న మొత్తం చెరువులు : 52
❒ అందులో నీరు చేరినవి : 44
❒ ఆయా మండలాల పరిధిలోని చెరువుల ఆయకట్టు : 7260 ఎకరాలు



రాప్తాడు మండలం బండమీదపల్లికి చేరిన హంద్రీనీవా నీరు

తెదేపా హయాంలోనే

మా గ్రామంలోని చెరువుకు గత తెదేపా హయాంలో రూ.కోటి వెచ్చించి ఎమ్మెల్యే పరిటాల సునీత కాలువ నిర్మాణం చేపట్టి నీటిని అందించారు. వైకాపా పాలనలో 5 సంవత్సరాలు చెరువుకు చుక్క నీరు రాలేదు. చెరువు నిండకుండలా ఉండటం సంతోషదాయకం.
- దగ్గుబాటి శ్రీనివాసులు, రైతు, బండమీదపల్లి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు
ప్రాంతీయ కార్యాలయము: అనంతపురము
అంబేద్కర్ రోడ్, జిల్లాపరిషత్ ఎదురుగా, అనంతపురము

టెండర్ ప్రకటన

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ **అనంతపురము - కళ్యాణదుర్గం రోడ్ శాఖను** ప్రస్తుతం ఉన్న శాఖకు సమీపంలోని **గణేశ్ నగర్, పాపంపేట, భాగ్యనగర్ మరియు కళ్యాణదుర్గం రోడ్- అనంతపురంలో** అన్ని వసతులు గల వేరొక భవనంలోనికి మార్చదలిచినాము.

ఇందు నిమిత్తము సుమారు **1400** నుండి **2000 చదరపు అడుగుల** కార్పెట్ ఏరియా గల కింది అంతస్తులోని భవనము (గ్రౌండ్ ఫ్లోర్) లేదా సొంత ఖాళీ స్థలంలో కింది అంతస్తులో భవనం (గ్రౌండ్ ఫ్లోర్) నిర్మించదలచిన వారు, **200 చదరపు అడుగుల మించి స్ట్రాంగ్ రూమ్** (రిజర్వ్ బ్యాంకు నియమ నిబంధనల మేరకు) మరియు పార్కింగ్ & నీటి సౌకర్యం కలిగి వున్న భవనము అద్దెకు కావలెను.

కావున ఆసక్తి గల వారి నుండి టెండర్ కోరడమైనది.

సాంకేతిక మరియు ఆర్థిక టెండర్ పత్రములు బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము నందు లభించును. పూర్తి చేసిన టెండర్లు, విడి విడి సీల్డ్ కవరులో ఉంచి, ఆ రెండింటినీ వేరొక కవరులో ఉంచి సీల్డ్ చేసి తేది **25-10-2024** లేదా అంతకన్నా ముందు, ప్రాంతీయ కార్యాలయము అనంతపురముకు చేరునట్లు పంపవలయును.

వివరములకు సంప్రదించండి: సెల్: 9490158012. ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము.

ఇట్లు: రీజనల్ మేనేజరు, అనంతపురము.
గమనిక: టెండర్లను ఏ దశలోనైనా రద్దు లేదా మార్పు చేసే అధికారము బ్యాంకు వారికి కలదు.

(c) eenadu